RNI NO : TELTEL/2023/89146
Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:205 | శుక్రవారం | 27 ఆగస్టు 2026 | పేజీలు :8 | వెల రూ.5
Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy


రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి
శెనార్తి మీడియా
ఆహ్వానం పలుకుతుంది
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.
PRESS
77309 83966    98491 98098

## మోదీ వైపే ప్రజలు.. కాంగ్రెస్ పార్టీకి షాక్..

- తాజా సర్వేలో సంచలనం..
- పేపర్ లీక్‌లు, నిరుద్యోగంపై యువతలో తీవ్ర అసంతృప్తి.
- పరీక్షా వ్యవస్థపై యువతకు అపనమ్మకం..
- అయినప్పటికీ మోడీపైనే దేశ ప్రజల విశ్వాసం..



4



## కర్ణాటక పవర్ కార్పొరేషన్‌కు సింగరేణి బొగ్గు

4

- రాష్ట్ర ఇంధన శాఖ మంత్రితో డిప్యూటీ సీఎం భట్టి చర్చలు

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

- మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
- ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
- తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్



4



2

## జిందాల్ వర్సిటీలో లెక్చర్‌కు కేటీఆర్‌కు ఆహ్వానం



## హన్మకొండలో బీఆర్ఎస్ ధర్నా

- హరీష్ రావు అరెస్ట్
- పోలీస్ స్టేషన్ ముందు బైఠాయింపు

**వరంగల్, ఆగస్ట్ 27 :**
బీఆర్ఎస్ ఎల్పీఉప నేత తన్నీరు హరీష్ రావును హనుమకొండ సుబేదారిలో పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి

మిగతా 2వ పేజీలో..

# రేషన్ వార్






- మోదీ ఫొటో ఎందుకు పెట్టలేదన్న బీజేపీ ప్రశ్న
- కేంద్రం సబ్సిడీ ఇస్తోందన్న కమలనాథుల వాదన
- సన్నబియ్యంపై రాష్ట్రానిదే భారీ భారం అంటున్న కాంగ్రెస్
- ఫొటోల కోసం సంక్షేమ పథకాలపై రాజకీయ పోరు
- లబ్ధిదారుడికి మేలు కంటే క్రెడిట్‌పైనే పార్టీల దృష్టి

**హైదరాబాద్, ఆగస్టు 27:**
తెలంగాణలో కొత్తగా పంపిణీ చేయనున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ వివాదానికి దారితీసింది. కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు మాత్రమే ముద్రిస్తున్నారని కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద కేంద్రం నిధులు, బియ్యం సబ్సిడీ అందిస్తున్నందున మోదీ చిత్రానికి స్థానం కల్పించాల్సిందేనని బీజేపీ వాదిస్తోంది. దీనికి ప్రతిగా సన్నబియ్యం సరఫరా, అదనపు కోటా కోసం రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులు ఖర్చు చేస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది.

**కేంద్రం సబ్సిడీ.. రాష్ట్రం అదనపు భారం**
జాతీయ ఆహార భద్రతా చట్టం, ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద అర్హులైన లబ్ధిదారులకు అందించే ఆహార ధాన్యాలపై కేంద్ర ప్రభుత్వం భారీగా

మిగతా 2వ పేజీలో..



## మిర్ ఆలం చెరువుకు కొత్త సొబగులు

- ఫ్యామిలీ టూరిస్టు హబ్‌గా అభివృద్ధి
- అకస్మికంగా పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి
- గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- సస్పెన్షన్ బ్రిడ్జి, వాటర్ స్పోర్ట్స్, ఐలాండ్ల అభివృద్ధికి ప్రణాళికలు

3



3

## అక్కచెల్లెళ్లకు సీఎం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

## ట్రాఫిక్, రోడ్ సేఫ్టీపై కార్యాచరణ రూపొందించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**హైదరాబాద్, ఆగస్టు 27:**
హైదరాబాద్ నగరం, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ

మిగతా 3వ పేజీలో..



## ఏఐసీసీ పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

- అధిష్టానం తీసుకునే నిర్ణయం అందరికీ శిరోధార్యం
- కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలకు తావు లేదు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

3




## రాష్ట్రంలో భారీగా ధాన్యం సైలోలు

- నిర్మాణం నుంచి నిర్వహణ వరకు ఎస్‌హెచ్‌జీలకు కీలక భాగస్వామ్యం
- అదనంగా 5 నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ నిల్వ సామర్థ్యం లక్ష్యం
- అత్యాధునిక సాంకేతికత వినియోగం
- మిల్లర్ల నుంచి బకాయిల వసూలుకు పటిష్ట కార్యాచరణ
- జీఈఎం, తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ధాన్యం వేలం
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

## నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

- కడియంపై వ్యాఖ్యలు.. కౌశిక్ రెడ్డికి నోటీసులు
- కౌశిక్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నంపై వేముల ఆగ్రహం

2

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- ఏడుగురు మృతి.. కొందరికి తీవ్ర గాయాలు
- సిఎం చంద్రబాబు, మంత్రుల దిగ్భ్రాంతి
- సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు



**పల్నాడు, ఆగస్ట్ 27:**
పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చిలకలూరిపేట అడ్డ రోడ్డు

మిగతా 3వ పేజీలో..

## ఎన్‌హెచ్-65లో 17 ఫ్లైఓవర్లు త్వరగా పూర్తి చేయాలి

- చిట్యాల ఫ్లైఓవర్ ఈ దసరా నాటికి పూర్తికావాలి
- మిగతావి డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలి
- సంక్రాంతికి వాహనాల రాకపోకలు సాగాలి
- సమీక్షలో ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి

2





## ఈవీ పథకం కింద ఆటో డ్రైవర్లకు సాయం

- రూ.200 కోట్లు కేటాయిస్తూ జీవో జారీ

2

# హన్మకొండలో బీఆర్ఎస్ ధర్నా

**మొదటిపేజీ తరువాయి**

వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. అలాగే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. జిల్లాలో జీవో 97 రద్దు చేయాలని నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు మాజీ మంత్రి హరీశ్ రావు వస్తున్న నేపథ్యంలో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కళాశాలకు వచ్చే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపించారు. అలాగే వరంగల్, హనుమకొండలో విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇప్పటికే ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డిని అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు.

**జీ.ఒ. 97ను రద్దు చేయాల్సిందే : హరీష్ రావు డిమాండ్**

పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 97 జీ.ఒ.ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు దిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు.

# ఎన్‌హెచ్-65లో 17 ఫ్లైఓవర్లు త్వరగా పూర్తి చేయాలి

**హైదరాబాద్, ఆగస్టు 27 :**

హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి 65పై చిట్యాల ఫ్లైఓవర్ ఈ దసరా నాటికి పూర్తిచేయాలని, మిగతావి డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ ఫ్లైఓవర్ల నుండి ఈ సంక్రాంతికి వాహనాల రాకపోకలు సాగాలని అధికారులకు తేల్చి చెప్పారు. నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో ఇప్పటికే వేలమంది తమ ప్రాణాలను కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. పలు రోడ్లు, ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంతోపాటు ఇటీవల జరిగిన పలు ప్రమాదాలపై మంత్రి ఆరా తీశారు. హైదరాబాద్‌విజయవాడ రహదారిలో గుర్తించిన 17 బ్లాక్ స్పాట్స్‌పై నిర్మిస్తున్న ఫ్లైఓవర్లు, హైమాస్ట్ లైట్స్ పనుల పురోగతిని తెలుసుకున్నారు. దాదాపు అన్ని ఫ్లైఓవర్ల నిర్మాణం చివరి దశలో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పెద్దకాపర్తి ఫ్లైఓవర్‌పై ఇప్పటికే ట్రాఫిక్ అనుమతిస్తుండగా సూర్యాపేట ఫ్లైఓవర్ ట్రాఫిక్ అనుమతికి సిద్ధంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలపై, కొన్నిచోట్ల రహదారికి రెయిలింగ్ లేని వార్తలపై ఆరా తీసిన మంత్రి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు పలు సూచనలు చేశారు. మూగ జీవాలు రహదారిపైకి రాకుండా రెయిలింగ్‌తోపాటు రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిత్యం ప్రమాదాలను నివారించాలంటే ఈ రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలన్నారు. రహదారి విస్తరణ కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిశామని గుర్తు చేశారు. రాష్ట్రం నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులతో కలిసి మరోసారి నితిన్ గడ్కరీని కలుస్తాం.. అవసరమైతే ప్రధానమంత్రిని కలుస్తాం అన్నారు. ఎన్‌హెచ్ 65 విస్తరణ పనులతో పాటు బుల్లెట్ ట్రైన్స్, ఇతర ఎన్‌హెచఏఐ ప్రాజెక్ట్స్ త్వరగా చేపట్టాలని కోరతామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. సమీక్షలో ఆర్ అండ్ బి ఈఎన్‌సీ లింగారెడ్డి, సీఈలు వసంత్ నాయక్, ధర్మారెడ్డి, పలువురు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఉన్నారు.

# జిందాల్ వర్సిటీలో లెక్చర్‌కు కేటీఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, ఆగస్ట్ 27 :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు హర్యానాలోని ప్రముఖ ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ఆహ్వానం అందింది. విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించడంతోపాటు వారిని ఉద్దేశించి 'డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్' ఇవ్వాలని యూనివర్సిటీ కేటీఆర్‌ను ఆహ్వానించింది. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సి. రాజ్ కుమార్ ఈ మేరకు కేటీఆర్‌కు ప్రత్యేకంగా లేఖ రాశారు. కేటీఆర్ రాక, ఆయన ఆలోచనలు, ప్రసంగం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తి, ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు. కేటీఆర్‌కు అనుకూలమైన తేదీ, సమయాన్నిబట్టి సెప్టెంబర్, అక్టోబర్ 2026లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత్‌లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీని సందర్శించాలని కూడా కేటీఆర్‌ను ఆహ్వానించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లోనూ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విశేష గుర్తింపు సాధించింది. గతంలో రాష్ట్రపతులు, ఉప రాష్ట్రపతులు, భారత ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సహా పలువురు ప్రముఖులు జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

**హైదరాబాద్, ఆగస్ట్ 27 :**

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై ఈనెల 29న అసెంబ్లీ కమిటీ హాల్ 1లో ఉదయం 11 గంటలకు ఎథిక్స్ కమిటీ భేటీ కానున్నది. కౌశిక్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై కమిటీ విచారించనున్నది. కాగా, ఎథిక్స్ కమిటీ పేరిట కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్షంపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బలిచేసేందుకు కుట్రలు చేస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నిండు శాసనసభలో బడివే, పండబెట్టి తొక్కుతా, బట్టలూడదీసి కొడతా, మా దగ్గర కండలు తిరిగినోళ్లున్నరు.. బొర్ల వేసి కొడ్తం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'అరేయ్ తోలుతీస్తా, బయట తిరుగనివ్వను' అని దానం నాగేందర్, 'పది కత్తులు లేస్తే తలలు తెగుతయ్.. కత్తులతో కోలాటమాడతా' అని మందుల సామేల్ బెదిరింపులు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్య సైగలు ఎథిక్స్ కమిటీ కిందకు రావా అని సూటిగా ప్రశ్నించారు. వారు మాట్లాడిన మాటలు, చేసిన చేష్టల వీడియోలు చూపుతూ ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి ప్రవర్తనపై చర్చించి చర్యల సిఫారసుకు ఈ నెల 29న ఎథిక్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసినట్టు నోటీసు వచ్చిందని, అయితే కౌశిక్ వ్యవహారాన్ని సిఫారసు చేసిన సమయంలో ఎథిక్స్ కమిటీ మనుగడలో లేదని తెలిపారు. అసలు కమిటీ లేనప్పుడు ఆ వ్యవహారాన్ని ఎలా రెఫర్ చేస్తారని ప్రశ్నించారు. దీన్నిబట్టి కక్ష సాధింపు చర్యగా అర్థమవుతుందన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కడియం అదే ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని కౌశిక్ ఆక్షేపించారని తెలిపారు.

# 'రేషన్' వార్

**మొదటిపేజీ తరువాయి**

సబ్సిడీ భరిస్తోంది. సాధారణ రేషన్ బియ్యంపై కిలోకు సుమారు రూ.35 నుంచి రూ.40 వరకు కేంద్రం సబ్సిడీ అందిస్తోందన్నది బీజేపీ వాదన. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కేంద్ర కోటాతోపాటు లబ్ధిదారుల సంఖ్యను పెంచేందుకు అదనపు బియ్యాన్ని సొంత నిధులతో సమకూరుస్తోందని చెబుతోంది.



ఇక రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీకి ప్రతి నెలా వందల కోట్ల రూపాయల ఆర్థిక భారం పడుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేస్తున్నారు. కేంద్రం సన్నబియ్యం సరఫరాకు అయ్యే మొత్తం వ్యయాన్ని భరిస్తే మోదీ ఫొటో ముద్రణపై తమకు అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయడం వివాదాన్ని మరింత రాజకీయ రంగు పులుముతోంది. రూ.15 వేల కోట్లకు పైగా కేంద్రం నుంచి నిధులు వస్తున్నప్పుడు కనీస గుర్తింపు కూడా ఇవ్వకపోవడమేంటని బీజేపీ ప్రశ్నిస్తోంది.

**ఫొటో చుట్టూ రాజకీయ లెక్కలు**

రేషన్ కార్డు అసలు ఉద్దేశం లబ్ధిదారుడి గుర్తింపు, ఆహార హక్కును నిర్ధారించడం. అది ఏ పార్టీకి ప్రచార వేదికగా మారకూడదన్న వాదన కూడా వినిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అమలు చేసే సంక్షేమ పథకాలకు సంబంధించి ఎవరి వాటా ఎంత అన్నది స్పష్టంగా ప్రజలకు తెలియజేయడం ఒక అంశమైతే.. ప్రజాధనంతో జారీ చేసే అధికారిక పత్రాలపై రాజకీయ నాయకుల చిత్రాలను ముద్రించడం మరో అంశంగా మారింది.

ఈ వివాదంలో ఇరు పార్టీలకు రాజకీయ ప్రయోజనాల లెక్కలు ఉన్నాయన్నది స్పష్టం. రేషన్ బియ్యం కేంద్రం అందిస్తున్నదనే భావన ప్రజల్లో బలపడితే బీజేపీకి రాజకీయ మైలేజ్ లభిస్తుంది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం, అదనపు కోటా ద్వారా తన సంక్షేమ పథకాలను ప్రచారం చేసుకుంటే కాంగ్రెస్‌కు లబ్ధి చేకూరుతుంది. దీంతో బియ్యం పంపిణీ కంటే దాని క్రెడిట్ ఎవరికి దక్కాలన్న పోరాటమే ముందుకొచ్చింది.

**డోర్ డెలివరీ సాధ్యమేనా?**

మోదీ ఫొటో లేకపోతే మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కేంద్రం నేరుగా ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేస్తుందని కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని మరింత పెంచాయి. అయితే ప్రస్తుత రేషన్ వ్యవస్థ రాష్ట్రాల పర్యవేక్షణలో డీలర్లు, రవాణా వ్యవస్థ, లబ్ధిదారుల వివరాలు, పంపిణీ కేంద్రాలతో అనుసంధానమై ఉంది. కేంద్రం ప్రత్యేకంగా సమాంతర పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయడం పరిపాలనా, సమాఖ్యపరమైన సంక్లిష్టతలకు దారితీసే అవకాశముంది.

అంతిమంగా రేషన్ కార్డుపై ఎవరి ఫొటో ఉందన్నది రాజకీయ పార్టీలకు ముఖ్యమైన అంశంగా మారినా.. లబ్ధిదారుడికి నాణ్యమైన బియ్యం సకాలంలో, పారదర్శకంగా అందుతున్నదా అన్నదే అసలు ప్రశ్న. కేంద్రం భరించే సబ్సిడీ, రాష్ట్రం చేసే అదనపు వ్యయం రెండింటినీ స్పష్టంగా ప్రజలకు తెలియజేసి, రాజకీయ ప్రచారానికి అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిన బాధ్యత ఇరు ప్రభుత్వాలపైనా ఉంది.

# రాష్ట్రంలో భారీగా ధాన్యం సైలోలు

**హైదరాబాద్, ఆగస్టు 27:**

రాష్ట్రంలో ఏటేటా విస్తరిస్తున్న వరి సాగు, గణనీయంగా పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి, ప్రభుత్వ సేకరణ అవసరాలకు దీర్ఘకాలిక పరిష్కారంగా అత్యాధునిక ధాన్య సైలోల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర పౌర సరఫరాల సంస్థను ఆదేశించారు. రాష్ట్రంలో అదనంగా 5 లక్షల నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ ధాన్య నిల్వ సామర్థ్యాన్ని సృష్టించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ సైలోల నిర్మాణం, నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు కొత్త మార్గాలను తెరవడంతోపాటు, రాష్ట్ర ఆహార భద్రతకు అవసరమైన శాశ్వత మౌలిక సదుపాయాల నిర్మాణంలో వారిని భాగస్వాములను చేసే నమూనాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. పౌర సరఫరాల సంస్థ కార్యకలాపాలపై సీనియర్ అధికారులతో మంత్రి ఉత్తమ్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి, సేకరణకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని విస్తరించాల్సిన అవసరాన్ని వివరించారు. మెరుగైన సాగునీటి సదుపాయాలు, సాగు విస్తీర్ణం పెరగడం, కనీస మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యం సేకరిస్తుండడంతో తెలంగాణలో వరి ఉత్పత్తితో పాటు ధాన్యం కొనుగోళ్లు కూడా ఏటేటా పెరుగుతున్నాయన్నారు. భవిష్యత్ అవసరాలను కేవలం సంప్రదాయ గోదాములతో తీర్చడం సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్, శాస్త్రీయ సంరక్షణ, యాంత్రిక రవాణా, డిజిటల్ పర్యవేక్షణ వంటి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలతో కూడిన నిల్వ నెట్‌వర్క్ అవసరమన్నారు. తేమ, పురుగులు, ఇతర నిల్వ సంబంధిత కారణాలతో ధాన్యం నష్టపోకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ధాన్యం నిల్వ నుంచి తరలింపు వరకు ప్రతి దశలో నాణ్యత, భద్రత, సామర్థ్యాన్ని పెంచే విధంగా సైలో వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామస్థాయి సంస్థలు, పౌర సరఫరాల సంస్థ భాగస్వామ్యంతో ఆధునిక సైలోల నిర్మాణం, నిర్వహణ చేపట్టేందుకు అనువైన నమూనాలను అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇందులో పౌర సరఫరాల సంస్థ, మహిళా సంఘాలు, ఇతర భాగస్వామ్య సంస్థల బాధ్యతలను స్పష్టంగా నిర్వచించాలని చెప్పారు. సైలోలు ఆర్థికంగా స్వయం సమర్థంగా, వృత్తిపరంగా నిర్వహించబడేలా తగిన ఆర్థిక, కార్యాచరణ నమూనాలను రూపొందించాలన్నారు. "రాష్ట్ర ధాన్య నిల్వ మౌలిక సదుపాయాలను కేవలం వచ్చే కొనుగోలు సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని కాదు.. రాబోయే దశాబ్దాల అవసరాలను ముందుగానే అంచనా వేసి నిర్మించాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పౌర సరఫరాల సంస్థ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, కేంద్ర గిడ్డంగుల సంస్థ, భారత ఆహార సంస్థ, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రైవేటు పెట్టుబడిదారుల గోదాముల ద్వారా ధాన్యం నిల్వ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు సొంతంగా సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ,ప్రతి సీజన్‌లో భారీగా సేకరిస్తున్న ధాన్యాన్ని నిల్వ చేసేందుకు ఇతర సంస్థలు, అద్దె గోదాములపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఇటీవలి ధాన్యం సేకరణ పరిమాణమే రాష్ట్ర నిల్వ వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిడిని తెలియజేస్తోందని మంత్రి చెప్పారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో పౌర సరఫరాల సంస్థ 90 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించేందుకు సిద్ధమైందని, సీజన్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా తక్షణమే సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. భారీ స్థాయిలో పెరుగుతున్న ధాన్యం సేకరణకు, అందుబాటులో ఉన్న శాశ్వత శాస్త్రీయ నిల్వ సామర్థ్యానికి మధ్య పెరుగుతున్న అంతరం కొత్త సైలోల నిర్మాణం ఎంత అత్యవసరమో స్పష్టం చేస్తోందన్నారు.




**మిల్లర్ల బకాయిల వసూలుకు పటిష్ట వ్యూహం**

డిఫాల్టర్ కస్టమ్ రైస్ మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయిల వసూలును వేగవంతం చేసేందుకు సమర్థవంతమైన కార్యాచరణ రూపొందించాలని మంత్రి పౌర సరఫరాల సంస్థను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలు, ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా బకాయిల వసూలు వ్యూహాన్ని సిద్ధం చేయాలని చెప్పారు. డిఫాల్టర్లపై చేపట్టే న్యాయపరమైన, విజిలెన్స్, పరిపాలనాపరమైన చర్యలన్నింటిలోనూ ప్రజాధనం తిరిగి రాబట్టడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం నిల్వల ప్రతిపాదిత వేలంపైనా మంత్రి సమీక్షించారు. తదుపరి విడత వేలం ప్రారంభించే ముందే లాట్ పరిమాణాలు, బిడ్డింగ్ నిబంధనలు, వేలం నిర్వహించే వేదికలను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. వేలం ప్రక్రియలో పారదర్శకత, ఏకరూపత, విస్తృత భాగస్వామ్యం ఉండేలా గవర్నమెంట్ ఈమార్కెట్ ప్లేస్, ఈప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ వంటి గుర్తింపు పొందిన ప్రభుత్వ వేదికలను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తికి తగిన నిల్వ సామర్థ్యాన్ని సృష్టించడం ద్వారా రైతుల కష్టార్జిత పంటకు భద్రత కల్పించడంతోపాటు, ప్రజాధనాన్ని కాపాడటం, నిల్వ నష్టాలను తగ్గించడం, పౌర సరఫరాల వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. సమావేశంలో పౌర సరఫరాల అదనపు సంచాలకుడు రోహిత్ సింగ్, పౌర సరఫరాల సంస్థ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



# ఈవీ పథకం కింద ఆటో డ్రైవర్లకు సాయం

- రూ.200 కోట్లు కేటాయిస్తూ జీవో జారీ

**హైదరాబాద్, ఆగస్ట్ 27 :**

ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆటోరిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్2026'ను అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఈ పథకం అమలుకు సిఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రి ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ఏకంగా రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉంది. ఈ పథకం ద్వారా సంప్రదాయ ఇంధన వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ ఆటోల వినియోగం పెరగనుంది. పెట్రోల్, డీజిల్ కోసం రోజూ అయ్యే ఖర్చుతో పోలిస్తే ఎలక్ట్రి వాహనాల నిర్వహణ వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో ఆటో డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరనుంది. రూ.200 కోట్ల నిధులతో 18,766 ఆటోలను ఇవిలుగా మార్చే ప్రక్రియను ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలి

- హరిత వాతావరణం ప్రోత్సహించడంలో భాగస్వాములు కావాలి
- 20వ గ్రాండ్ నర్సరీ మేళాను ప్రారంభించిన మంత్రి తుమ్మల
- ఐదు రోజులపాటు ఆల్ ఇండియా హార్టికల్చర్ అండ్ అగ్రికల్చర్ షో

**హైదరాబాద్, ఆగస్టు 27 :**

ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగర జీవనంలో పెరుగుతున్న ఒత్తిడి, కాలుష్యం నేపథ్యంలో హరిత వాతావరణాన్ని పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐమ్యాక్స్ థియేటర్ పక్కన హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 20వ గ్రాండ్ నర్సరీ మేళాఆల్ ఇండియా హార్టికల్చర్ అండ్ అగ్రికల్చర్ షోను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్‌స్‌ను పరిశీలించిన మంత్రి తుమ్మల మాట్లాడుతూ 2015 నుంచి ప్రతి ఏడాది జనవరి, ఆగస్టుల్లో క్రమం తప్పకుండా నర్సరీ మేళాను నిర్వహించడం అభినందనీయమని మంత్రి అన్నారు. ప్రజలకు వివిధ రకాల మొక్కలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించడానికి ఈ మేళా మంచి అవకాశంగా నిలుస్తుందని పేర్కొన్నారు. 31వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరగనున్న ఈ మేళాలో 110కిపైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ నర్సరీల నుంచి తీసుకొచ్చిన అనేక రకాల మొక్కలను ప్రజలకు అందుబాటులో ఉంచారు. టెర్రస్ గార్డెనింగ్, వెర్టికల్ గార్డెనింగ్, హైడ్రోపోనిక్ గార్డెనింగ్‌కు అవసరమైన మొక్కలతో పాటు పూల మొక్కలు, మెడిసినల్ ప్లాంట్స్, బోన్సాయి, అలంకరణ మొక్కలు వంటి విభిన్న రకాల మొక్కలు మేళాలో అందుబాటులో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్, కోల్‌కతాతోపాటు ఢిల్లీ, హర్యానా, గుజరాత్, ముంబయి, బెంగళూరు, పూణే, షిర్డీ, చెన్నై, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి మొక్కలను తీసుకొచ్చారు. నాగాలాండ్ నుంచి వచ్చిన కాక్టస్ వంటి ప్రత్యేక ఆకర్షణ కలిగిన మొక్కలు కూడా మేళాలో ఉన్నాయని వివరించారు. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా రూ.20 నుంచి రూ.2.5 లక్షల విలువైన మొక్కల వరకు వివిధ రకాల మొక్కలు మేళాలో లభిస్తున్నాయని మంత్రి తెలిపారు. మొక్కల పెంపకానికి అవసరమైన మెటీరియల్స్, ఆర్గానిక్ ఎరువులు, ఫెర్టిలైజర్లు, టెర్రకోట కుండీలు తదితర సామగ్రి కూడా ఒకేచోట లభించడం మేళా ప్రత్యేకతగా పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో లభించే అరుదైన, ప్రత్యేకమైన మొక్కలను హైదరాబాద్ నగర ప్రజలకు ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయమని మంత్రి తుమ్మల అన్నారు. మొక్కలు ఇంటి అందాన్ని పెంచడమేకాక ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయని తెలిపారు. మొక్కల పెంపకాన్ని అలవాటుగా చేసుకోవడం ద్వారా సమయాన్ని సృజనాత్మకంగా వినియోగించుకోవచ్చన్నారు. ఈ మేళా ద్వారా ప్రజలకు మొక్కలపై అవగాహన పెరగడంతోపాటు ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించడానికి మంచి అవకాశం లభిస్తుందని మంత్రి అన్నారు. హైదరాబాద్ నగర వాసులందరూ ఈ ఐదు రోజుల నర్సరీ మేళాను సందర్శించి తమకు నచ్చిన మొక్కలను కొనుగోలు చేసి తమ ఇళ్లను మరింత పచ్చదనంతో నింపాలని కోరారు.

# మిర్ ఆలం చెరువుకు కొత్త సొబగులు

**హైదరాబాద్, ఆగస్టు 27 :**

చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు ప్రభుత్వం కొత్త రూపు, సరి కొత్త హంగులు సమకూర్చాలని యోచిస్తోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి, వినోదం, విశ్రాంతిని ఆస్వాదించేలా దీనిని ప్రముఖ పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మిర్ ఆలం చెరువును ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం అకస్మికంగా పరిశీలించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. చెరువు చుట్టూ జరుగుతున్న పనులు, చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఫొటో ప్రదర్శన ద్వారా పనుల పురోగతిని సీఎంకు అధికారులు వివరించారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. చెరువు పునరుజ్జీవం, చెరువు పరిసర ప్రాంతాలు, అందులోని ఐలాండ్ల అభివృద్ధి, చెరువుపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం.. ఈ మూడు ప్రధాన అంశాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అయితే, మిర్ ఆలం చెరువులోకి మురుగు నీరు చేరకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. చెరువు నుంచి మూసీ నదిలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవంతోపాటు నీటి నాణ్యతను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.



**వాటర్ స్పోర్ట్స్‌కు డిజైన్**

మిర్ ఆలం చెరువులో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అవసరమైన సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, అడ్వెంచర్ కార్యకలాపాలకు అవకాశాలను పరిశీలించాలన్నారు. దీంతో యువతతోపాటు కుటుంబాలకు కూడా ఆకర్షణీయమైన వినోద కేంద్రంగా మిర్ ఆలం మారుతుందని అభిప్రాయపడ్డారు. చెరువు చుట్టూరా ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోద, కార్యకలాపాల కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలన్నారు. పాదచారులకు అనుకూలంగా వాకింగ్, పబ్లిక్ స్పేస్‌లను తీర్చిదిద్దడంతోపాటు రాకపోకల సౌకర్యాన్ని మెరుగుపరచనున్నట్లు□యన తెలిపారు.

**ఐలాండ్లకూ కొత్త రూపు**

మిర్ ఆలం చెరువులో ఉన్న ఐలాండ్లను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్ (టెంట్లు వేయడం), ఇతర పర్యాటక కార్యకలాపాలకు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునే అవకాశాలను అధికారులను పరిశీలించాలని చెప్పారు. వెడ్డింగ్, ఈవెంట్ డెస్టినేషన్ల ఏర్పాటుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల అభివృద్ధిలో పీపీపీ విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వెల్లడించారు.

**జూ పార్కుతో సమగ్ర పర్యాటక అనుసంధానం**

సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని అనుసంధానం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జూ సందర్శన, ప్రకృతి, చెరువు అందాలు, కుటుంబ వినోదం అన్నీ ఒకే పర్యాటక అనుభవంగా అందించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. ట్యాంక్ పునరుజ్జీవం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్నదన్నారు.

**సస్పెన్షన్ బ్రిడ్జి పనుల్లో 50 శాతం పురోగతి**

మిర్ ఆలం ట్యాంక్‌పై నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. నేటితో లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 పూర్తయ్యాయి. అంటే 50.18 శాతం పనులు పూర్తయ్యాయి. 62 పైల్ క్యాప్స్‌లో 28 పూర్తికాగా, 45.16 శాతం పురోగతి నమోదైంది. 62 పియర్‌కమ్‌పియర్ క్యాప్స్‌లో ఇప్పటివరకు ఆరు పూర్తయ్యాయి. విమానాశ్రయానికి సమీపంలో ఉన్న మిర్ ఆలం చెరువును పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. చారిత్రక చెరువు, పచ్చని పరిసరాలు, నెహ్రూ జూ పార్కు సమీపం, ఐలాండ్లు, వాటర్ స్పోర్ట్స్, కుటుంబ వినోదం, ఫుడ్‌కోర్టులు, ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జితో మిర్ ఆలం ట్యాంక్‌కు రికొత్త గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అభివృద్ధి పూర్తయితే నగరవాసులతోపాటు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే ప్రముఖ పర్యాటక కేంద్రంగా మిర్ ఆలం ట్యాంక్ మారనుంది.

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

సెంటర్ వద్ద ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతులను బొంతా బాబు, బొంతా మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మమ్మ, గంగమ్మ, మరియమ్మ, చౌటుపల్లి సువార్తగా గుర్తించారు. కాగా, బాధితులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా పోలీసులు తెలిపారు. వీరంతా ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హాస్పిటల్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్య కుమార్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతిచెందడం, పలువురు గాయపడటంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. 'చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్తొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. ప్రమాదంపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పల్నాడు జిల్లా అదనపు ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం సహా అన్ని కోణాల్లో విచారణ చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయసహకారాలు అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రైవేటు ట్రావెల్స్ రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా స్పందించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతిచెందడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి చెందారు. అధికారుల నుంచి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ప్రమాదంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని శ్రీనివాసరావు ఆకాంక్షించారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు. ప్రమాద ఘటనపై పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. చిలకలూరిపేట పట్టణంలో ఇంత పెద్ద ప్రమాదం ఎప్పుడూ జరగలేదని.. ప్రమాదంలో ఏడుగురు చనిపోవడం తనను కలచి వేసిందన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి హామీ ఇచ్చారు.

# ఏఐసీసీ పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

**నిజామాబాద్, ఆగస్టు 27:**

మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందని, క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపినట్ల టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కొండా సురేఖ అంశం కాంగ్రెస్ లో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సురేఖ కూతురు సుష్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం, దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా కుమార్తె వ్యాఖ్యలకుతనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలని ఆయన అన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని, కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. ఇక తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు 'సర్' నోటీసు అందిందని, వివరాలు సమర్పిస్తానని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు.



# ట్రాఫిక్, రోడ్ సేఫ్టీపై కార్యాచరణ రూపొందించాలి

**మొదటిపేజీ తరువాయి**

ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సచివాలయంలో ఉన్నతాధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ సిగ్నళ్ల నిర్వహణ, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, అత్యవసర సేవలకు వేగవంతమైన మార్గాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాలు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మున్సిపల్, పోలీస్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. నవంబర్, డిసెంబర్ నాటికి అవసరమైన ప్రాంతాల్లో సిగ్నలింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**శాఖల మధ్య సమన్వయం**

నార్కోటిక్ బ్యూరో, టీజీసేఫ్ తరహాలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత కోసం ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ (టీజీటీఎంఎఆర్ఎస్) పేరుతో ప్రత్యేక, స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎస్ సూచించారు. సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరించడంతోపాటు ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత పటిష్టం చేయాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం 429 ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థలు ఉన్నాయని, వీటిలో అధునాతన సిగ్నల్ నియంత్రణ వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు. ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత ఒకే శాఖకు పరిమితమైన అంశాలు కావని, పోలీస్, రవాణా, రోడ్లుభవనాలు, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సీఎస్ పేర్కొన్నారు. ప్రతి ప్రాంతానికి సంబంధించిన ట్రాఫిక్ డేటాను సమీకరించి ఒకే వేదికపై విశ్లేషించేందుకు ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ డేటా ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా, సురక్షితంగా మార్చేందుకు కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎస్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కేవలం ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించడానికే పరిమితంకాక ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేలా ఉండాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారాలను గుర్తించేందుకు డేటా ఆధారిత, సాంకేతికత ఆధారిత, ప్రజా ప్రయోజనకరమైన విధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఐ ఆధారిత ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతకు సంబంధించి అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యయనం చేసి అవసరమైన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టులను చేపట్టాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టుల ఫలితాల ఆధారంగా వాటిని దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో డీజీపీ సి.వి.ఆనంద్, రవాణా, రోడ్లుభవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అక్కచెల్లెళ్లకు సీఎం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 27 :**

రాఖీ పౌర్ణమి పండగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అక్కచెల్లెళ్ళలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన ఈ పండగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం వెల్లివిరియాలని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే బృహత్ సంకల్పంలో భాగంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు.



# తుమ్మిడిహట్టిపై 1న కీలక సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 27 :**

ప్రాణహితపై తెలంగాణ ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సేవా భవన్‌లో జరిగే ఈ సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేసిన నిరంతర ప్రయత్నాల నేపథ్యంలో కేంద్ర జల సంఘం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. తుమ్మిడిహట్టిని ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసి రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లగా ప్రధాని కార్యాలయం జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించింది. అనంతరం ఆగస్టు 5న కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌కు సీఎం ప్రత్యేకంగా లేఖ రాసి కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. మహారాష్ట్ర గతంలో అంగీకరించిన 148 మీటర్ల ఎత్తుకు బదులుగా 152 మీటర్ల ఎత్తు ఉండేలా అంగీకారం సాధించేందుకు తెలంగాణ ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తీసుకోవడం సాధ్యం కాదని, భారీ పంపులు వినియోగిస్తే విద్యుత్ వ్యయం పెరుగుతుందని కేంద్రానికి వివరించింది. తక్కువ విద్యుత్ వ్యయంతో, దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా ప్రాజెక్టును నిర్మించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన వాదన. సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనాల ప్రకారం జలమట్టం పెంపుతో అదనపు ముంపు పరిమితంగానే ఉంటుందని కూడా ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. వెనుకబడిన, కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే ఈ కీలక ప్రాజెక్టును త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం, మహారాష్ట్రలతో సంప్రదింపులు కొనసాగిస్తోంది.







# మైనింగ్ ఏడీ జయరాజు ఇళ్లపై ఏసీబీ దాడులు

- **భారీగా నగదు, నగలు స్వాధీనం**

**హైదరాబాద్,ఆగస్ట్ 27 :**

భాగ్యనగరంలో మరోసారి ఏసీబీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీ జయరాజు ఇళ్లలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. గురువారం తెల్లవారుజాము నుంచే సోదాలు మొదలయ్యాయి. భూపాలపల్లితోపాటు హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు ప్రాంతాల్లోని 8 చోట్ల అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో దాడులు కొనసాగుతున్నాయి. జయరాజ్ ఇంట్లో లక్షన్నర నగదు, బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్, ల్యాండ్ డాక్యుమెంట్లను గుర్తించి పరిశీలిస్తున్నారు. బ్యాంకులో రూ.60 లక్షల నగదు ఏసీబీ అధికారులు గుర్తించారు. అలాగే రెండు కార్లు, రెండు బైక్‌లు, జనగామలో ఐదు ఎకరాల భూమి ఏసీబీ అధికారుల తనిఖీల్లో బయట పడింది. సోదాలపై ఏబీసీ జాయింట్ డైరెక్టర్ సాయిమనోహర్ మాట్లాడుతూ భూగర్భ జల గనుల శాఖ ఏడీ జయరాజు నివాసంతోపాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఉదయం నుంచి జరుగుతున్న సోదాల్లో 40తులాల బంగారాన్ని గుర్తించామన్నారు. ఇంట్లో లక్షన్నర నగదుతోపాటు ఆయన బ్యాంకు ఖాతాలో నగదును కూడా గుర్తించామని తెలిపారు. జనగామలో ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఆయనపై ఏసీబీకి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. హైదరాబాద్‌లోనే నాలుగుచోట్ల సోదాలు కొనసాగుతున్నాయని సాయిమనోహర్ తెలిపారు. తాండూరు, వరంగల్‌లోని జయరాజ్ సన్నిహితులు, బంధువుల ఇళ్లల్లో కూడా సోదాలు జరుగుతున్నాయన్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్‌తోపాటు రెండు కార్లు, రెండు బైక్‌లను కూడా గుర్తించామన్నారు. సోదాల అనంతరం ఆయన అక్రమాస్తులపై స్పష్టత వస్తుందని చెప్పారు. జయరాజ్ ఇటీవలే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. ములుగు, భూపాలపల్లి జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న కొందరితో జయరాజ్ కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు గతంలో అనేకసార్లు వెల్లువెత్తాయి.




# భార్యపై భర్త ఆధిపత్యం కుదరదు

- భార్య బానిస కాదు
- పెళ్లంటే పరస్పర గౌరవంతో బతికే బంధం
- పనిమానిషిగా చూడాలనుకునే తీరు క్షమార్హ్వం కాదు
- కర్నాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

**బెంగళూరు, ఆగస్ట్ 27 :**

వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే నిబంధన ఏదీ లేదని పేర్కొంది. జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన సతీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెకు కుటుంబ న్యాయస్థానం నెలకు రూ.9,000 చొప్పున భరణం చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, తన అనుమతి తీసుకోకుండానే తరచూ పుట్టింటికి వెళ్తోందని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వాదనలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. భర్త ఆరోపణలను పరిశీలిస్తే భార్యను కుటుంబ సభ్యురాలిగా కాక ఇంటి పనుల కోసం ఉంచుకున్న వ్యక్తిగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. భార్య తన తల్లిదండ్రులను కలవడానికి పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాలనే ఆలోచనను కోర్టు ప్రశ్నించింది. ఒక మహిళ తన తల్లిదండ్రులను కలవడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భార్య ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి అనే విషయాలను పూర్తిగా భర్త నియంత్రించడం సరైన పద్ధతి కాదని కోర్టు పేర్కొంది. ఇలాంటి ఆంక్షలు మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను దెబ్బతీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంటి పనులన్నీ భార్యే చేయాలనే భావన సరికాదని కూడా స్పష్టం చేసింది. కుటుంబ జీవితంలో భార్యాభర్తలు ఇద్దరూ బాధ్యతలను పరస్పరం పంచుకోవాలని పేర్కొంది. వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా వారి సొంత పిల్లలపై ఉంటుందని తెలిపింది. అత్తమామలను చూసుకోవడాన్ని కోడలిపై తప్పనిసరి బాధ్యతగా మోపడం సమంజసం కాదని స్పష్టం చేసింది. కోడలు అత్తమామలకు సేవ చేయడం ఆమె ఇష్టంతో జరగాలి తప్ప బలవంతం చేయడం సరికాదని పేర్కొంది. వివాహ బంధం కొన్ని ఆచారాలు, సంప్రదాయాలతో ఏర్పడే సంబంధం కాదని, పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది. భార్యాభర్తల మధ్య ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, సహకారం ఉండాలని తెలిపింది. లింగం ఆధారంగా మహిళల స్వేచ్ఛను పరిమితం చేయడం రాజ్యాంగం అందించే సమానత్వ సూత్రాలకు విరుద్ధమని అభిప్రాయపడింది. భార్య, కుమార్తెకు రోజుకు రూ.150 చొప్పున కూడా భరణం చెల్లించలేనని భర్త చేసిన అభ్యర్థనను కోర్టు కొట్టివేసింది.

# కర్ణాటక పవర్ కార్పొరేషన్‌కు సింగరేణి బొగ్గు

**బెంగళూరు, ఆగస్టు 27 :**



కర్ణాటక రాష్ట్రానికి చెందిన జెన్‌కోకు ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల్లో ఉన్న బొగ్గు బ్లాక్ మైనింగ్‌లో సింగరేణి అనుభవాన్ని వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కర్ణాటక ఇంధన శాఖ మంత్రి జార్జ్‌కు ప్రతిపాదించారు. మైనింగ్‌లో కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్, సింగరేణి సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో ముందుకు వెళ్దామని భట్టి విక్రమార్క చేసిన ప్రతిపాదనపై కర్ణాటక ఇంధన శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారు. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బెంగళూరులో కర్ణాటక ఇంధన శాఖ మంత్రి జార్జ్‌తో గురువారం సమావేశం అయ్యారు. ఇప్పటికే ఉన్న ఇంధన సరఫరా ఒప్పందంలో భాగంగా సింగరేణి బొగ్గు సరఫరాపై ఇరు రాష్ట్రాల మంత్రులు చర్చించారు. ఇంధన రంగంలో కర్ణాటక జెన్కోకు ఉన్న అనుభవాన్ని సింగరేణి సంస్థ తన భవిష్యత్తు ప్రాజెక్టులలో ఉపయోగించుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. ప్రస్తుతం కర్ణాటకతో సింగరేణికి ఉన్న బొగ్గు సరఫరా ఒప్పందాలపై, బొగ్గు సరఫరా సరళిపై ఇరు రాష్ట్రాల మంత్రులు సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రానికి కూడా నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేయాలని భట్టి విక్రమార్కను కర్ణాటక మంత్రి జార్జ్ కోరగా కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు రోజుకు నాలుగు బొగ్గు రేకులను సరఫరా చేయాల్సిందిగా సింగరేణి అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు కర్ణాటక విద్యుత్ అవసరాల కోసం ఒడిషా రాష్ట్రంలోని నైనీ బొగ్గు గని నుంచి ఏడాదికి ఒక మిలియన్ టన్ను బొగ్గును అందించేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు సింగరేణి అధికారులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన ఈ విషయాన్ని కర్ణాటక ఇంధన శాఖ మంత్రికి తెలిపారు. సమావేశం అనంతరం సింగరేణి వేలంలో దక్కించుకున్న కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా దేవదుర్గ తాలుకా లింగదహళ్ళి గ్రామంలో బంగారం, రాగి ఖనిజ బ్లాకును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి అధికారులతో కలిసి పరిశీలించారు. ఖనిజ అన్వేషణ విషయంలో స్థానిక అధికార యంత్రాంగంతో సమావేశమై దిశా నిర్దేశం చేయనున్నారు. డిప్యూటీ సీఎం వెంట సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్న తదితరులు ఉన్నారు.

# యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

- మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
- ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
- తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్

**న్యూఢిల్లీ,ఆగస్ట్27:**

లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, రు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ పక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.



# మోడీ వైపే ప్రజలు.. కాక్రోచ్ పార్టీకి షాక్..

**న్యూఢిల్లీ, ఆగస్టు 27:**

దేశ రాజకీయ ముఖచిత్రాన్ని ప్రతిబింబించే "మూడ్ ఆఫ్ ది నేషన్ (MOTN)" ఆగస్టు 2026 ఫలితాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మరోసారి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 326 సీట్లతో అధికారంలోకి వస్తుందని అంచనా వేసింది. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి 185 సీట్లు వస్తాయని అంచనా వేసింది. అయితే, ప్రశ్నాపత్రాల లీకేజ్, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి అంశాలపై యువత అసంతృప్తిగా ఉన్నప్పటికీ, ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వం వైపే యువత ,జెన్‌జీ ఉన్నట్లు తెలిపింది.

ఇటీవల ప్రశ్నాపత్రాల లీకులు, కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం నేపథ్యంలో ఈ సర్వే కీలక విషయాలను వెల్లడించింది. . పరీక్షల నిష్పాక్షికతపై 40 శాతం మంది యువతకు నమ్మకం లేదని, మరో 27 శాతం మంది ఈ వ్యవస్థపై చాలా తక్కువ నమ్మకం ఉందని తెలిపారు. మొత్తంగా 67 శాతం మంది యువత పరీక్షా వ్యవస్థపై అనుమానాలు వ్యక్తం చేయగా, కేవలం 14 శాతం మంది మాత్రమే అది పూర్తిగా నిష్పాక్షికంగా ఉందని భావించారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల ప్రక్రియ చాలా నెమ్మదిగా జరుగుతోందని, నమ్మదగినదిగా లేదని 17 శాతం జెన్‌జీ యువత అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ అతిపెద్ద వైఫల్యంపై ప్రశ్నించగా.. రిగ్గింగ్, అవినీతిని అరికట్టడంలో విఫలమవడమే ప్రధాన కారణమని 9.8 శాతం మంది చెప్పారు. గత సర్వేలో ఈ అభిప్రాయం కేవలం 1.4 శాతంగా ఉండటం గమనార్హం.

**నిరుద్యోగంపై యువతలో ఆగ్రహం..**

ప్రశ్నాపత్రాల లీకేజీలపై ఉన్న ఆగ్రహానికి నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తోడైనట్లు సర్వే వెలఅ్లడించింది. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యగా 22.7 శాతం మంది నిరుద్యోగాన్ని పేర్కొన్నారు. నిరుద్యోగ పరిస్థితి చాలా తీవ్రమైందిగా 42.3 శాతం, మరో 23.8 శాతం తీవ్రమైందిగా పేర్కొన్నారు. బీజేపీ కూటమి ప్రభుత్వంలో 23 శాతం ద్రవ్యోల్బణం, 15.9 శాతం మంది నిరుద్యోగాన్ని అతిపెద్ద వైఫల్యాలుగా చెప్పారు. రోజూ వారీ ఖర్చులు గతేడాదితో పోలిస్తే కష్టంగా మారిందని 65 శాతం మంది చెప్పారు.

**సీజేపీకి షాక్..**

పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా, విద్య కోసం, జెన్‌జీ కోసం పోరాడుతున్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)కి ప్రజలు షాక్ ఇచ్చారు. 39 శాతం మంది యువత అది 'ప్రెజర్ గ్రూపు''గానే పనిచేయాలని, రాజకీయ పార్టీగా మారకూడదని చెప్పారు. ఒక వేళ సీజేపీ ఎన్నికల్లో పోటీ చేస్తే ఓటు వేస్తారా అనే ప్రశ్నకు 43 శాతం మంది నిరాకరించగా, 33 శాతం మంది మద్దతు తెలిపారు.

**సమస్యలు ఉన్నా మోడీకే మద్దతు..**

ఇలాంటి ఆందోళనలు ఉన్నప్పటికీ ఇప్పటికీ దేశంలో అత్యంత ప్రజాధరణ కలిగిన రాజకీయ నాయకుడిగా ప్రధాని నరేంద్రమోడీ ఉన్నారు. 48.7 శాతం మంది ప్రజలు ఇప్పటికీ నరేంద్ర మోదీని తదుపరి ప్రధానమంత్రిగా తమ మొదటి ఎంపికగా భావిస్తుండగా, 27.1 శాతంతో రాహుల్ గాంధీ రెండవ స్థానంలో ఉన్నారు. సర్వకాలీన ఉత్తమ ప్రధానమంత్రి రేసులో కూడా 41.1 శాతంతో నరేంద్రమోదీ ముందంజలో ఉన్నారు. 51.3 శాతం మంది ప్రజలు ప్రధానమంత్రి వ్యక్తిగత పనితీరును అద్భుతం పనిచేశారని అభిప్రాయపడ్డారు.




# రైల్వే స్టేషన్లలో ఇకపై చెత్త వేస్తే రూ.1000 జరిమానా

**హైదరాబాద్, ఆగస్ట్ 27:**

రైలు ప్రయాణికులకు ముఖ్య గమనిక.. రైల్వే స్టేషన్లు, ప్లాట్‌ఫారాలు, బోగీల్లో చెత్త వేసినా, ఉమ్మినా అధికారులు ఇకపై రూ.1,000 వరకు జరిమానా విధించనున్నారు. గతంలో ఈ జరిమానా రూ.500 ఉండేది. ఈనెల 24 నుంచి ఈ నిబంధన అమల్లోకి వచ్చింది. జరిమానా చెల్లించని వారిపై కోర్టు రూ.2,000 వరకు అదనపు ఫైన్ విధించే అవకాశం ఉంది. స్టేషన్ మాస్టర్లు, టికెట్ కలెక్టర్లు ఈ జరిమానాను వసూలు చేస్తారు. రైల్వే ఆస్తులను కాపాడటంతోపాటు స్టేషన్లు, రైళ్లలో పరిశుభ్రతను పెంచడమే దీని ముఖ్య ఉద్దేశ్యం.

# జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

- 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను తెరిచిన ప్రజలు
- వివరాలు వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 27:**

దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి. 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి పేర్కొన్నారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రాణ, నగర ప్రాంతాల్లో ఉండగా అందులో 56 శాతం మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకుపైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్‌ఆధార్ మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. 2014 ఆగస్టు 28న ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక నిరుపేదలకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేలా చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది. జన్‌ధన్ ఖాతాలను కనీస నిల్వ లేకుండానే నిర్వహించుకోవచ్చు.. కానీ చెక్కు సౌకర్యం కావాలంటే మాత్రం ఖాతాలో కనీస బ్యాలన్స్ తప్పనిసరి నిబంధన విధించారు.

PRADHAN MANTRI JAN-DHAN YOJANA
MERA KHATA BHAGYA VIDHATA

# దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ముఖ్యం

- ఖేలో ఇండియా సంవాద్
- క్రీడాకారులకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 27 :**



దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అథ్లెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిధ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

**క్రీడల ప్రోత్సాహానికి ప్రధాని శ్రీకారం :కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

ప్రధాని మోడీ నాయకత్వంలో క్రీడలను ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన ఎజెండాగా ఉంది. గతంలో క్రీడల పట్ల నిర్లక్ష్యం ఉండేదని, రాజకీయ జోక్యం వల్ల ప్రతిభ ఉన్న నిజమైన క్రీడాకారులకు తగిన అవకాశాలు దక్కేవవి కాదని కేంద్ర బొగ్గు, గనుల శాU మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఓయూ క్యాంపస్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ)లో గురువారం జరిగిన ఖేలో ఇండియా డైలాగ్‌ఖేల్ కీ బాత్ పీఎంకే సాత్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న 1500 విద్యా సంస్థల విద్యార్థులు, యువ క్రీడాకారులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాదాపు పదిలక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మన దేశంలో ప్రపంచంలోనే అత్యధిక యువత, విద్యార్థుల జనాభా ఉన్నప్పటికీ గతంలో క్రీడలను విస్మరించారు. కానీ నేడు పరిస్థితి మారుతూ ఉంది.. కిందిస్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రధాని శ్రీకారం చుట్టడంతో అంతర్జాతీయ పోటీల్లో మన దేశం ఎక్కువ పతకాలు సాధిస్తోంద'ని తెలిపారు. అంతర్జాతీయ పోటీలకు వెళ్లే ప్రతీ క్రీడాకారుడిని ప్రధాని మోదీ స్వయంగా కలుస్తారని, ఎవరైనా గెలిస్తే తల్లిదండ్రులు లేదా కోచ్‌ల కంటే ముందే స్వయంగా ఫోన్ చేసి అభినందిస్తారని చెప్పారు. ఒకవేళ ఓడిపోయినా సరే క్రీడాకారులు నిరుత్సాహపడకుండా వారికి ధైర్యం చెబుతూ అండగా నిలుస్తున్నారన్నారు. క్రీడాకారులకు కావలసిన పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు, వారికి నచ్చిన దేశంలో, నచ్చిన కోచ్‌లతో శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తోందని చెప్పారు. దేశంలోని యువ జనాభా ప్రాతిపదికన క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించాలన్నదే ప్రధాని లక్ష్యమన్నారు. భారత దేశం 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోందని, అలాగే 2036 ఒలింపిక్స్ మన దేశంలో జరిగేలా విదేశాలతో చర్చలు జరుపుతూ గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని కూడా కిషన్‌రెడ్డి చెప్పారు. అప్పటికల్లా ప్రపంచ దేశాలతో సమానంగా క్రీడా రంగంలో భారత్ ముందుండాలనేది మన ప్రయత్నమని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల అధినేతలు అందరూ చదువుతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని సూచించారు. అందరం కలిసికట్టుగా ప్రయత్నిస్తే రానున్న రోజుల్లో ప్రపంచ క్రీడా చిత్రపటంలో భారతదేశం అగ్రస్థానానికి చేరుకోవడం తథ్యం అని మంత్రి అన్నారు.

# డంపింగ్ యార్డును పరిశీలించిన కలెక్టర్





**శెనార్తి మీడియా, హుజురాబాద్:**

హుజురాబాద్ మండలం సిర్సపల్లి సమీపంలో జాతీయ రహదారి563ను ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డును జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గురువారం రాత్రి పరిశీలించారు. జాతీయ రహదారిని ఆనుకుని డంపింగ్ యార్డు ఉండటంపై ఎన్‌హెచ్ఏఐ అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఈ ప్రాంతాన్ని సందర్శించారు. రహదారిని ఆనుకుని కొంత దూరం వరకు చెత్త డంప్ చేయడాన్ని నిలిపివేసి, రహదారికి కొంత దూరంలో చెత్తను వేయాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రహదారి పక్కన పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలు జాతీయ రహదారి నుంచి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో డంపింగ్ యార్డుకు చేరుకునేలా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని డివిజన్ల వారీగా సేకరించిన చెత్తను యార్డులో వేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో జలకుమారి, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, తహసీల్దార్ నరేందర్ పాల్గొన్నారు.

## రీసర్వేకు రైతులు సహకరించాలి

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

ఆధునిక సర్వే సాంకేతిక పరిజ్ఞానంతో ఖచ్చితమైన జియోరిఫరెన్స్‌డ్ కాడస్ట్రల్ మ్యాపులు, శాశ్వత డిజిటల్ భూ రికార్డుల కోసం తెలంగాణ ప్రభుత్వం రీసర్వే చేపడుతోందని అడిషనల్ కలెక్టర్ డా. డి. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గన్నేరువరం మండలం యస్వడ గ్రామంలో నిర్వహించిన రీసర్వే గ్రామసభకు ఆయన హాజరై రైతులతో మాట్లాడారు. రీసర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, సర్వే అనంతరం రైతులకు శాటిలైట్ మ్యాపులను అందజేస్తామని తెలిపారు. భూ రికార్డుల నిర్వహణను సులభతరం, ఖచ్చితమైన, పారదర్శకమైన డిజిటల్ విధానంలో చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు రీసర్వే ప్రక్రియకు సహకరించాలని అడిషనల్ కలెక్టర్ కోరారు. గ్రామసభలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి కిషన్‌రావు, తహసీల్దార్ నరేందర్, సర్పంచ్ తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి




**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

యాదగిరిగుట్టలో జరుగుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ బెజ్జంకి మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ యువతకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐవైఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు బోనగిరి శ్రావణ్‌తో కలిసి మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ యువత సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని విమర్శించారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం దాన్ని నెరవేర్చాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.5 వేల భృతి అందించాలని కోరారు. రాష్ట్రంలోనూ ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని అన్నారు. నిరుద్యోగం, ఉపాధి, విద్య, ఉద్యోగ అవకాశాల సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. యువత అధిక సంఖ్యలో హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు అంతటి రాకేష్, ఉపాధ్యక్షులు రోడ్డ లక్ష్మణ్, శంకర్, మధు, సుమంత్, వడ్లూరి మల్లేశం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## పోలీస్‌స్టేషన్‌లో రక్షాబంధన్ వేడుకలు

**శెనార్తి మీడియా,బెజ్జంకి:**

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా పోలీస్ సిబ్బంది ఎస్సై తోట తిరుపతికి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై తోట తిరుపతి మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల అనుబంధం, పరస్పర ప్రేమాభిమానాలకు ప్రతీక అని అన్నారు. సమాజంలో సోదరభావం పెంపొందించడంతోపాటు మహిళలు, బాలికల భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మహిళా కానిస్టేబుళ్లు పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

# పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మొలంగూర్, కన్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రాఖీ పండుగ ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొలంగూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ మాట్లాడుతూ రాఖీ పండుగ సోదర, సోదరీమణుల ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పరస్పరం రాఖీలు కట్టుకుని సోదరభావాన్ని చాటుకున్నారు. "నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష.. మనిద్దరం దేశానికి రక్ష" అంటూ దేశభక్తిని చాటుకున్నారు. రాఖీ పండుగను సంప్రదాయ పద్ధతిలో కుటుంబ సభ్యులు, సోదరులతో కలిసి జరుపుకోవాలని సూచించారు. కన్నాపూర్ పాఠశాలలోనూ ప్రధానోపాధ్యాయుడి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఖీ పండుగ విశిష్టత, అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని



తెలియజేసే కథలను విద్యార్థులకు వివరించారు. రెండు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో



ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పెన్షన్ అర్హులు మిస్ కాకూడదు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

పెన్షన్ పథకంలో అర్హులైన వారు మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో అనిత సూచించారు. శంకరపట్నం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో పెన్షన్ పథకాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 30లోపు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో పూర్తిస్థాయిలో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ సురేఖ, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




**శెనార్తి మీడియా, కరీంనగర్:**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ టీజేఏసీ ఆధ్వర్యంలో 206 సంఘాలు చేపట్టిన రాష్ట్రవ్యాప్త ధర్నాలు విజయవంతమయ్యాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే మంజూరు చేయడంతో పాటు పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బకాయిలను చెల్లించాలని, హెల్త్ కార్డులు జారీ చేసి అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కేశవపట్నం గ్రామంలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు చేపట్టారు. రైతు గుజ్జు విజయ రాకేష్‌రెడ్డి సాగు చేసిన 6 ఎకరాల ఆయిల్‌పామ్ పంటకు ఇది తొలి కోత. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం టన్నుకు రూ.23 వేల చొప్పున గెలలను విక్రయించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకొని అధిక లాభాలు అందించే ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేష్, ఏఈఓ స్రవంతి, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ జాకీ, రైతులు పాల్గొన్నారు.



# దాచారంలో రక్షాబంధన్ వేడుకలు



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని దాచారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బైర మానస రాజేందర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ దీటి బాలనర్సు, గ్రామ యువకులు, పెద్దలు, పంచాయతీ సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ బైర మానస రాజేందర్ మాట్లాడుతూ రక్షాబంధన్ ప్రేమ, ఆప్యాయత, ఐక్యత, పరస్పర రక్షణకు ప్రతీక అని అన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం, గ్రామాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేస్తూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. రక్షాబంధన్ అందరి జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, వివిధ రంగాల ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఓటరు జాబితాను సరిచూసుకోవాలి

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్లు తమ వివరాలను సరిచూసుకోవాలని కల్లేపల్లి గ్రామ సర్పంచ్ బిగుల్ల మోహన్ సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలోని తప్పులను సరిచేయడంతోపాటు మృతి చెందిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించనున్నట్లు తెలిపారు. అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడంతో పాటు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సేకరించి పాత వివరాలను సరిచూస్తారని తెలిపారు. ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకుని మార్పులు, చేర్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినీత్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితాను సరిచూసుకోవాలి

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా గన్నేరువరం గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు అడిషనల్ కలెక్టర్, మానకొండూర్ నియోజకవర్గ ఈఆర్ఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటరు జాబితాలోని పేర్లను బహిరంగంగా చదివి వినిపించి గ్రామస్తుల సమక్షంలో జాబితాను పరిశీలించారు. ప్రతి కుటుంబం తమ సభ్యుల పేర్లు, వయస్సు, లింగం, చిరునామా, ఫొటో తదితర వివరాలను స్వయంగా పరిశీలించుకోవాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు మిస్ కాకుండా, అనర్హులు, నకిలీ నమోదులు కొనసాగకుండా జాబితాను నిబంధనల ప్రకారం పరిశీలించాలని తెలిపారు. ఏఎస్‌డీ జాబితాలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించాలని సూచించారు. వివరాల్లో తప్పులు ఉంటే ఫారం8 ద్వారా, కొత్త ఓటర్ల నమోదుకు ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనర్హులు, నకిలీ లేదా అర్హత లేని నమోదులపై ఫారం7 ద్వారా అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని వివరించారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసే యువతతోపాటు అర్హులైన పౌరులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, బీఎల్ఓ సూపర్‌వైజర్ శ్రీనాథ్, సర్పంచ్ లక్ష్మినర్సు, బీఎల్ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డబుల్ రోడ్డు కోసం దీక్ష

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి షట్టర్స్ ఎదురుగా చేపట్టనున్న నిరాహార దీక్ష పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా యువజన నాయకుడు కాలువ నాగరాజు మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ దీక్షకు తరలిరావాలని పిలుపునిచ్చారు. అధికార, ప్రతిపక్ష నాయకులతోపాటు గన్నేరువరం గ్రామ ప్రజలు, యువజన సంఘాల నాయకులు దీక్షకు మద్దతు ఇవ్వాలని కోరారు. అడగనిదే అమ్మ అయినా అన్నం పెట్టదని, అదే విధంగా డబుల్ రోడ్డు కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. డబుల్ రోడ్డు కోసం గతంలో యువజన సంఘాల నాయకులు ఎలా మద్దతు ఇచ్చారో, ఈసారి కూడా నిరాహార దీక్షలో పాల్గొని పోరాటానికి అండగా నిలవాలని నాగరాజు కోరారు.





# 31న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**





తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రాంలో భాగంగా మంచిర్యాల మెడికల్ గోడౌన్ ప్రాంగణంలో నిర్మించిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ఈనెల 31న ప్రారంభించనున్నారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అమలు భాగస్వామిగా వ్యవహరిస్తున్న ఈ కిచెన్ ద్వారా జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 691 ప్రభుత్వ పాఠశాలలు, 13 జూనియర్ కాలేజీల్లో చదువుతున్న సుమారు 49 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించనున్నారు. 17 మండలాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతా ప్రమాణాలతో అల్పాహారం అందించడం ద్వారా విద్యార్థులు ఉదయం ఆకలితో ఇబ్బంది పడకుండా ఉత్సాహంగా విద్యను అభ్యసించేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.

# డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**




జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో డీసీపీ ఎ.భాస్కర్ తదితర అధికారులతో కలిసి డ్రగ్స్ నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 49 కేసులు నమోదు చేసి 103 మందిని గుర్తించినట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీల ద్వారా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, డ్రగ్ డీఅడిక్షన్ కేంద్రాలకు తరలించిన వారికి కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. మెడికల్ షాపులను పర్యవేక్షిస్తూ, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్.. ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓవర్‌లోడింగ్, అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చూడాలని తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో డీసీపీ ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ జీతాలు చెల్లించాలి



**శెనార్తి మీడియా, మంచిర్యాల(బెల్లంపల్లి):**

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించడంతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ నిధులను వెంటనే జమ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఒక నెలకు సంబంధించిన బడ్జెట్ విడుదలైనప్పటికీ సంబంధిత ఏజెన్సీ కాంట్రాక్టర్ కార్మికులకు జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం రెండు నెలల జీతాలు, మూడు నెలల ఈపీఎఫ్, ఈఎస్ఐ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జీతాలు సకాలంలో అందక కార్మికులు ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, రోజువారీ ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. . పెండింగ్ జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ నిధులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా కలెక్టర్, డీసీహెచ్ఎస్ అధికారులు స్పందించి సంబంధిత ఏజెన్సీపై చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి శానిటేషన్ వర్కర్లు జానకి, దీప, లక్ష్మి, జ్యోత్స్న, కనకమహాలక్ష్మి, సృజన, భాగ్యలక్ష్మి, లావణ్య, వరలక్ష్మి, రాజశేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# డిగ్రీ కళాశాలలో 'ఖేల్ కి బాత్ పీఎం కే సాత్'

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఖేలో ఇండియా సంవాద్'లో భాగంగా 'ఖేల్ కి బాత్ పీఎం కే సాత్' కార్యక్రమాన్ని విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ సందేశాన్ని విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంచిర్యాల జిల్లా బాక్సింగ్ కోచ్ సీహెచ్. రాజేష్, జాతీయ స్థాయి బాక్సింగ్ క్రీడాకారులు, మై భారత్ వాలంటీర్ స్ఫూర్తి రెడ్డిని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నరేందర్ రెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వికారాబాద్ డీఆర్వో మంగీలాల్ మృతి

**శెనార్తి మీడియా, వికారాబాద్:**



వికారాబాద్ జిల్లా డీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న మంగీలాల్ అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో సెలవులో ఉన్న ఆయన గురువారం కన్నుమూశారు. డీఆర్వోగా పనిచేసిన కొద్దికాలంలోనే మంచి పరిపాలనా నైపుణ్యంతో విధులు నిర్వర్తించారని ఉద్యోగులు కొనియాడారు. ప్రజా సేవలో చక్కటి పనితీరు కనబరిచిన అధికారిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

## రాపిడో ఆటోలో మర్చిపోయిన బ్యాగ్..

# సురక్షితంగా అప్పగించిన పోలీసులు




**శెనార్తి మీడియా, కుషాయిగూడ/మల్కాజిగిరి:**

రాపిడో ఆటోలో ఓ మహిళ మర్చిపోయిన విలువైన వస్తువుల బ్యాగ్‌ను కుషాయిగూడ పోలీసులు చాకచక్యంగా ట్రేస్ చేసి బాధితురాలికి అప్పగించారు. హెచ్‌బీ కాలనీ ఇంద్రానగర్‌కు చెందిన మహిళ గోధుమకుంటలోని ఓ కార్యక్రమానికి రాపిడో ఆటోలో వెళ్లి బ్యాగ్‌ను అందులోనే మర్చిపోయారు. ఆమె ఫిర్యాదు మేరకు క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ఆటోను గుర్తించి, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులోని సుమారు 2 తులాల బంగారు ఉంగరాలు, 10 తులాల వెండి పట్టీలను బాధితురాలికి సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, కానిస్టేబుల్ మహేష్‌లను క్రైమ్ ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

# జలమండలి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **ఎంపీ ఈటల రాజేందర్‌కు బీఆర్ఎస్‌కేవీ నాయకుల వినతి**

**శెనార్తి మీడియా, మల్కాజ్‌గిరి:**



జలమండలిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని BRSKV నాయకులు కోరారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్ నేతృత్వంలో గురువారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కేటగిరీ-2 కార్మికుల సమస్యలతో పాటు విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు అందాల్సిన సహాయాన్ని వెంటనే అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో BRSKV నాయకులు అశోక్, ప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్

**వరంగల్, ఆగస్టు 28:**

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వరంగల్ నగరంలోని 2వ డివిజన్ గుండ్లసింగారంలో గురువారం నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఆయన పాల్గొని గిరిజన దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గిరిజనులు తమ పిల్లలను ఉన్నతంగా చదివించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలు, సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించడం అభినందనీయమన్నారు. సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గిరిజనుల విజ్ఞప్తి మేరకు డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



# రీ-సర్వేను వేగవంతం చేయాలి

- **కలెక్టర్ కుమార్ దీపక్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



జిల్లాలో భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ, అటవీ భూములు, గ్రామాల హద్దులు తదితర ప్రాంతాలను సమగ్రంగా సర్వే చేయాలని సూచించారు. ప్రతి బృందం రోజుకు 30 ఎకరాల వరకు సర్వే చేసేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. సర్వేతో పాటు కొరిలేషన్ స్టేట్‌మెంట్ తయారీ, రైతులకు నోటీసుల జారీ ప్రక్రియలను ఏకకాలంలో చేపట్టి, ఎలాంటి జాప్యం లేకుండా నోటీసులు అందించాలని తెలిపారు. రీసర్వేపై రైతులకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించి, ప్రజల సహకారంతో పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రీసర్వేకు పైలట్ గ్రామంగా తాండూర్ మండలంలోని రాంపూర్‌ను ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ గ్రామంలో సుమారు 581 ఎకరాల భూమి ఉందన్నారు. ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, రీసర్వేపై అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. తహసిల్దార్లు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించిన పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తుల్లోని భూమి విస్తీర్ణ వివరాలను రెవెన్యూ రికార్డులతో సరిపోల్చిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ నోటీసుల జారీతో పాటు బూత్ స్థాయి అధికారుల విధులను కూడా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. రీసర్వే, ఎస్ఐఆర్, రెవెన్యూ రికార్డుల నవీకరణ ప్రక్రియలను సమన్వయంతో కొనసాగిస్తూ నిర్ణీత లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కేజీబీవీల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ కుమార్ దీపక్**

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మందమర్రి మండల కేంద్రంలోని కేజీబీవీని గురువారం సందర్శించిన కలెక్టర్.. కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం విద్యాలయంలోని వంటశాల, భోజనశాలలను పరిశీలించిన ఆయన.. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, పారిశుద్ధ్య ప్రమాణాలను తనిఖీ చేశారు. బాలికలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి విద్యాబోధన, వసతులు, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సంబంధిత అధికారులు, ఉపా

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి



- **అదనపు కలెక్టర్ వి.రాములు**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. గురువారం హాజీపూర్ మండలం కర్ణమామిడి, లక్షెట్టిపేట మండలం చందారం గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన ఎస్ఐఆర్ గ్రామసభల్లో ఆయన పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచాలని, అందులో గుర్తించిన అనామలీస్ ఓటర్ల వివరాలను గ్రామసభలో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ (ASD) ఓటర్లను గుర్తించి, నిబంధనల మేరకు నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు చేపట్టాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఎస్ఐఆర్‌లోని ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఓటర్ల వివరాల పరిశీలనలో అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ వి.రాములు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ మార్ఫింగ్‌తో మహిళపై కక్ష

**శెనార్తి మీడియా, హైదరాబాద్:**



డబ్బు వివాదంతో పాత సహోద్యోగినిపై కక్ష పెంచుకున్న యువకుడు.. ఆమె ఫొటోలను ఏఐ సాయంతో అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేసిన కేసులో నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు ఆనంద క్రిష్ణన్ అన్బలగన్ (26)గా పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు బాధితురాలి ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ ఖాతాల నుంచి ఫొటోలు సేకరించి మార్ఫింగ్ చేశాడు. అనంతరం నకిలీ ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ ఖాతాల ద్వారా వాటిని ప్రచారం చేశాడు. బాధితురాలి పేరుతో తప్పుడు పోస్టులు పెట్టడంతో పాటు మానసికంగా వేధించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ 78, ఐటీ యాక్ట్ సెక్షన్లు 67, 67ఏ కింద కేసు నమోదు చేసి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇతరుల ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేయడం, వాటిని సోషల్ మీడియాలో షేర్, ఫార్వర్డ్ చేయడం కూడా నేరమేనని పోలీసులు హెచ్చరించారు.

# రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య ఫలితం

- శ్రీలంక ఆటగాడు సోనాల్ దినుషా అజేయ శతకం
- శ్రీలంకతో డ్రాగా ముగిసిన రెండో టెస్ట్
- టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం
- శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య



ఫలితం ఎదురైంది. విజయం ఖాయమనుకున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. సోనాల్ దినుషా(264 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 133 నాటౌట్) అజేయ శతకంతో టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసాడు. మరోవైపు ఓటమి తప్పదనుకున్న మ్యాచ్‌లో సోనాల్ దినుషా, టెయి-ఎలెండర్ల అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో శ్రీలంక డ్రాతో గట్టెక్కింది. దాంతో ఈ రెండు టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది. 229/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌ను 154 ఓవర్లలో 429/9 స్కోర్ వద్ద డ్రా చేసింది. రెండో ఇన్నింగ్స్ ఆడేందుకు తగిన ఓవర్లు లేకపోవడంతో.. శుభ్‌మన్ గిల్ షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. సోనాల్ దినుషా అజేయ శతకంతో పాటు పసింధు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92), కామిందు మెండీస్(92 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో



55), కేశర నువాంత(150 బంతుల్లో 4 ఫోర్లతో 46) విలువైన పరుగులు చేశారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(3/121), రవీంద్ర జడేజా(3/94) మూడేసి వికెట్లు తీయగా.. ప్రసిధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, సారాన్ష్ జైన్ తలో వికెట్ తీసారు. తొలి సెషన్‌లోనే ఫలితం తేలుతుందని భారత్ భావించగా.. సోనాల్ దినుషా, కేశర నువాంత అడ్డుగోడగా నిలిచారు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. 32 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఈ ఇద్దరూ.. తొలి సెషన్‌లో 100 పరుగులు జోడించారు. దాంతో శ్రీలంక 329/6 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో కేశర నువాంత ఔటవ్వడంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే ప్రభాత్ జయసూర్య కూడా ఔటవ్వడంతో భారత శిభిరంలో ఆశలు చిగురించాయి. కానీ లాహిరు కుమారతో కలిసి సోనాల్ దినుషా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. జిడ్డుగా ఆడిన ఈ జోడీ.. భారత బౌలర్ల సహనాన్ని దెబ్బతీసింది. 383/8 స్కోర్‌తో శ్రీలంక టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఇదే ప్రదర్శనను కొనసాగించిన శ్రీలంక 400 పరుగుల మార్క్‌ను అందుకుంది. 196 బంతుల్లో దినూషా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 90 బంతులాడిన లాహిరు కుమారను జడేజా ఔట్ చేసినా ఫలితం లేకపోయింది. అసితా ఫెర్నాండో(0 నాటౌట్) కలిసి దినుషా మరో 10 ఓవర్లు ఆడగా.. శ్రీలంక డిక్లేర్ చేసింది. శుభ్‌మన్ గిల్ వెంటనే షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. వర్షం అంతరాయం, పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడం, భారత ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం లోపించడం.. గిల్ సేన విజయాన్ని అడ్డుకున్నాయి.



# రవీంద్ర జడేజా చెత్త రికార్డ్..

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చెత్త రికార్డ్ నమోదు చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో అతి తక్కువ కాలంలో అత్యధిక నోబాల్స్ వేసిన ఆటగాడిగా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. 2021 నుంచి టెస్ట్‌ల్లో జడేజా 88 నోబాల్స్ వేసాడు. శ్రీలంకతో రెండో టెస్ట్‌లో జడేజా మొత్తం నాలుగు నోబాల్స్ వేసాడు. తొలి ఇన్నింగ్స్‌లో మూడు నోబాల్స్ వేసిన జడేజా.. రెండో ఇన్నింగ్స్‌లో ఒకటి వేసాడు. తొలి టెస్ట్‌లోనూ జడేజా నాలుగునో బాల్స్ వేసాడు. ఇన్నింగ్స్‌కు రెండు చొప్పున నోబాల్స్ సంధించాడు. ఇందులో ఒకటి ధనంజయ డి సిల్వాకు లైఫ్‌లైన్‌గా మారింది. దాంతో టెస్టు క్రికెట్‌లో ఒక స్పిన్నర్ అత్యధిక నో బాల్స్ వేసిన చెత్త రికార్డును జడేజా మూటగట్టుకున్నాడు. జడేజా తర్వాత రెండో స్థానంలో పాకిస్థాన్ స్పిన్నర్ నోమన్ అలీ ఉన్నాడు.రెండో టెస్ట్‌లో జడేజాతో సహా భారత బౌలర్లంతా 10 నోబాల్స్ వేసారు. అఫ్గానిస్థాన్(14) తర్వాత అత్యధిక నోబాల్స్ వేసిన జట్టుగా భారత జట్టు అప్రతిష్టను మూటగట్టుకుంది.ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజులో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు.తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది.

# కొత్త గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌గా డ్రీమ్11

డ్రీమ్11 కొత్త దారిలోకి అడుగుపెట్టింది. రియల్ మనీ గేమింగ్, నగదు బహుమతులతో కూడిన ఫాంటసీ స్పోర్ట్స్ కాంటెస్టులను ఆపేసిన ఏడాది తర్వాత, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా స్పోర్ట్స్ అభిమానులను కలిపే ప్లాట్‌ఫామ్‌గా మారిందని పీటీఐ వెల్లడించింది. ఇకపై డ్రీమ్11లో ప్రైజ్ మనీ ఉండదు. స్పోర్ట్స్ కంటెంట్, లైవ్ స్ట్రీమింగ్, స్కోర్లు, స్టాట్స్, కమ్యూనిటీ ఫీచర్లు, స్పోర్ట్స్ అనుభవాలు, సోషల్ కాంటెస్టులపై సంస్థ దృష్టి పెట్టనుంది. గురువారం డ్రీమ్11 ఈ మార్పును ప్రకటించింది. ఇంతకాలం ఫాంటసీ స్పోర్ట్స్‌పై ప్రధానంగా దృష్టి పెట్టిన ప్లాట్‌ఫామ్, ఇప్పుడు గ్లోబల్ స్పోర్ట్స్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌గా మారింది.




కొత్త ప్లాట్‌ఫామ్‌లో ఏఐకి ప్రధాన పాత్ర ఉండనుంది. యూజర్లు ఇష్టపడే స్పోర్ట్స్, లీగ్‌లు, టీమ్‌లు, ప్లేయర్ల ఆధారంగా వారికి నచ్చే కంటెంట్, అనుభవాలను వ్యక్తిగతంగా అందించనుంది. ప్రపంచవ్యాప్తంగా స్పోర్ట్స్ అభిమానులను ఒక కమ్యూనిటీగా కలపడం ద్వారా 'మేక్ స్పోర్ట్స్ బెటర్' అనే తమ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని డ్రీమ్11 చెబుతోంది. కొత్త డ్రీమ్11లో ఒక్క క్రికెట్‌కే పరిమితం కాకుండా పలు రకాల స్పోర్ట్స్ అందుబాటులో ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులను దృష్టిలో పెట్టుకుని ప్లాట్‌ఫామ్‌ను రూపొందిస్తున్నారు. యూజర్లు లైవ్ మ్యాచ్‌లు చూడొచ్చు. గత వారాంతంలో జరిగిన రేస్‌ను ఫాలో అవ్వొచ్చు. స్టాటిస్టిక్స్, కామెంటరీ చూడొచ్చు. స్పోర్ట్స్‌కు సంబంధించిన ప్రత్యేక అనుభవాలను బుక్ చేసుకోవచ్చు. స్నేహితులు, ఇతర స్పోర్ట్స్ అభిమానులతో కలిసి సోషల్ కాంటెస్టుల్లో పాల్గొనొచ్చు.డ్రీమ్11 సీఈఓ వైభవ్ కోకల్ మాట్లాడుతూ, తమ 30 కోట్ల మంది యూజర్లతో పనిచేసిన అనుభవం ద్వారా స్పోర్ట్స్ అభిమానులు కేవలం ఆటను మాత్రమే కోరుకోవడం లేదని చెప్పారు. వాళ్లు ఒక కమ్యూనిటీలో భాగంగా ఉండాలని కూడా కోరుకుంటున్నారని తెలిపారు. "దేశంలోని అత్యుత్తమ టెక్ టాలెంట్ మద్దతుతో, ఇండియాలో తయారై ప్రపంచం కోసం రూపొందించిన ఏఐ-ఫస్ట్ స్పోర్ట్స్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను ఇప్పుడు నిర్మిస్తున్నాం" అని ఆయన చెప్పారు. గత ఏడాది ఆగస్టులో పార్లమెంట్ 'ప్రొమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్, 2025'ను ఆమోదించిన తర్వాత డ్రీమ్11 తన రియల్ మనీ గేమింగ్ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత ప్లాట్‌ఫామ్‌లో డబ్బులు చెల్లించి ఆడే కాంటెస్టులన్నింటినీ ఆపేసింది. కొత్త చట్టానికి అనుగుణంగా ఉచితంగా ఆడే సోషల్ గేమింగ్ మోడల్‌కు మారింది. మొత్తంగా చూస్తే, డ్రీమ్11 ఇకపై డబ్బులు గెలుచుకునే ఫాంటసీ స్పోర్ట్స్ యాప్‌గా కాకుండా, లైవ్ స్పోర్ట్స్, కంటెంట్, స్టాట్స్, కమ్యూనిటీ, సోషల్ కాంటెస్టులు, స్పోర్ట్స్ అనుభవాలను ఒకే చోట అందించే గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌గా తన కొత్త ప్రయాణాన్ని కొనసాగించనుంది.

# అభిషేక్ శర్మపై వేటు?

భారత పురుషుల క్రికెట్ జట్టు సెప్టెంబర్ 2026లో అఫ్గానిస్తాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్ కోసం అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన తమ బలమైన జట్టును అధికారికంగా ప్రకటించింది. ఇందులో స్టార్ ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తిరిగి జట్టులోకి రావడం విశేషం. నవీన్ చివరిసారిగా డిసెంబర్ 2024లో అఫ్గానిస్తాన్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. కాగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి వచ్చే నెలలో జరగనున్న ఈ సిరీస్ కోసం భారత జట్టును త్వరలోనే ప్రకటించనుంది. ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలోని ప్రసిద్ధ అరుణ్ జైట్లీ స్టేడియంలో సెప్టెంబర్ 13, 15 మరియు 17 తేదీల్లో జరగనుంది. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రమాదకరమైన జట్లను సైతం ఓడించే సత్తా ఉన్న అఫ్గానిస్తాన్‌ను టీమిండియా ఏమాత్రం తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. మరోవైపు, ఈ సిరీస్ భారత ఆటగాళ్లకు రాబోయే ఏషియన్ గేమ్స్ 2026 సన్నాహకాల కోసం అత్యంత కీలకమైన వేదికగా ఉపయోగపడనుంది.భారత్ గత జూలైలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన మూడు మ్యాచ్‌లను క్లీన్ స్వీప్ చేసింది. అయితే అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో ఆడిన టీ20 సిరీస్‌లలో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేక తీవ్రంగా నిరాశపరిచింది. దీంతో సెలెక్టర్లు అఫ్గానిస్తాన్‌తో పోరు కోసం పటిష్టమైన సమతూకంతో కూడిన జట్టును ఎంపిక చేయాలని భావిస్తున్నారు. గతంలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అందుకున్న విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ ఇటీవలి కాలంలో తీవ్ర ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. జింబాబ్వే పర్యటనతో పాటు, ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ బ్యాట్‌తో రాణించడంలో విఫలమయ్యాడు. దీంతో అఫ్గానిస్తాన్ సిరీస్ నుంచి అతడిని తప్పించినా ఆశ్చర్యపోనక్కర్లేదని తెలుస్తోంది. అభిషేక్ శర్మ స్థానంలో కేరళకు చెందిన స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకున్న శాంసన్‌ను జింబాబ్వే సిరీస్‌కు ఎంపిక చేయకపోవడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజా సిరీస్‌తో అతను మళ్లీ మెయిన్ స్క్వాడ్‌లోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. భారత్ తరఫున టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన స్టార్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ఈ సిరీస్‌కు పునరాగమనం చేయడం ఖాయం. అయితే సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 2022 తర్వాత భువనేశ్వర్ భారత్ తరఫున మళ్లీ మ్యాచ్ ఆడలేదు. యితే ఐపీఎల్ 2026లో ఆర్సీబీ తరఫున అద్భుత స్వింగ్ బౌలింగ్‌తో మెరిసిన భువీ, ప్రస్తుతం యూపీ టీ20 లీగ్‌లోనూ నిలకడగా వికెట్లు తీస్తూ వార్తల్లో నిలుస్తున్నాడు. దీంతో అతడిని తిరిగి జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. త్వరలోనే బీసీసీఐ పూర్తి జట్టు వివరాలను ప్రకటించే అవకాశం ఉంది.



# ఐసీసీపై మండిపడ్డ స్టీవ్ వా




వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. ఐసీసీ తీసుకున్న ఈ ఫార్మాట్ మార్పు నిర్ణయంపై ఇప్పటికే అసోసియేట్ దేశాలైన స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆగస్టులో ఈ రెండు బోర్డులు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఐసీసీ నిర్ణయం అసోసియేట్ దేశాల క్రికెట్‌కు పెద్ద ఎదురుదెబ్బ అని, ఇటీవల కాలంలో ఆటను విస్తరించడానికి సాధించిన పురోగతిని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. "టోర్నమెంట్ ప్రారంభానికి 18 నెలల కంటే తక్కువ సమయం ఉన్న తరుణంలో, పురుషుల 50 ఓవర్ల ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రక్రియ, టోర్నమెంట్ ఫార్మాట్‌లో ఐసీసీ భారీ మార్పులు చేయడం తీవ్ర నిరాశ కలిగించింది. క్రికెట్ తన పరిధిని విస్తరించుకోవాలని, కొత్త ప్రేక్షకులను ఆకర్షించాలని చూస్తున్న తరుణంలో.. ఎదుగుతున్న చిన్న దేశాలకు అవకాశాలు తగ్గించడం అంతర్జాతీయ క్రీడా ప్రపంచానికి చాలా తప్పుడు సంకేతాన్ని పంపుతుంది" అని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి.

# అందరికీ కనెక్ట్ అయ్యే మంచి ఎంటర్‌టైనర్

అల్లరి నరేష్ ఫాంటసీ కామెడీ 'రంభ ఊర్వశి మేనక'తో అలరించబోతున్నారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వంలో, అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మించారు. సురభి, రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్ హీరోయిన్స్ గా నటించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్ టీజర్ ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా టైటిల్ సాంగ్ రిలీజ్ చేశారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మా టీజర్‌కి, ట్రైలర్‌కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు టైటిల్ సాంగ్ రిలీజ్ చేస్తున్నాము. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో ఇది చాలా డిఫరెంట్. తప్పకుండా దీనికి మీరు సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను. థియేటర్‌లో ఈ సాంగ్ ఇంకా చాలా బాగుంటుంది. అందరూ ఈ సినిమాని థియేటర్‌లో చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. అల్లరి నరేష్ గారితో నటించడం చాలా అద్భుతమైన ఎక్స్పీరియన్స్. ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది. చాలా మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. ఈ సినిమా కోసం ఆహార నియమాలు చాలా కఠినంగా పాటించాను. ఈ సినిమా షూటింగ్ కూడా మాకు చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఇప్పటివరకు చేయని క్యారెక్టర్స్‌లో చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ప్రిశా సింగ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సాంగ్‌కి అందరూ డాన్స్ చేస్తారు. ప్రతి ఒక్కరికీ ఈ పాట నచ్చుతుంది. సెప్టెంబర్ 4న అందరూ ఈ సినిమాని థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో ఒక డిఫరెంట్ కాస్ట్యూమ్ వేసుకుని యాక్టింగ్ చేయడం చాలా కొత్త ఎక్స్‌పీరియన్స్. ఈ సినిమా నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. అల్లరి నరేష్ గారితో నటించడం చాలా హ్యాపీగా అనిపించింది. విష్ణుప్రియ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ పాట మీ అందరికీ నచ్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. థియేటర్‌లో ఈ పాట మీ అందరినీ సీట్లో నుంచి లేచి డాన్స్ చేసేలా చేస్తుంది. తప్పకుండా సెప్టెంబర్ 4వ తేదీన థియేటర్‌లో కలుద్దాం. తప్పకుండా ఈ సినిమాని మీరు చాలా ఎంజాయ్ చేస్తారు. ఇందులో నేను చేసిన క్యారెక్టర్ నాకు చాలా సంతోషాన్నిచ్చింది. 'రంభ ఊర్వశి మేనక' చుట్టూ తిరిగే కథ ఇది. ఇప్పటివరకు రంభ, ఊర్వశి, మేనకలను ఒక డాన్స్‌కి లేకపోతే ఒక సన్నివేశానికి రావడం చూశాము. కానీ ఈ కథ మాత్రం చుట్టూ రంభ, ఊర్వశి, మేనకల చుట్టూనే తిరుగుతుంది.





## మోస్ట్ అవైటెడ్ సెకండ్
# సింగిల్ లాంచ్!

నేచురల్ స్టార్ నాని మోస్ట్ అవైటెడ్ పాన్-వరల్డ్ చిత్రం 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఈ సినిమాను ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, టీజర్‌కు భారీ స్పందన వచ్చింది. ఇటీవల విడుదలైన ఫస్ట్ సింగిల్ 'ఆయా షేర్' చార్ట్‌బస్టర్‌గా నిలిచి సినిమాపై అంచనాలను మరింత పెంచింది. తాజాగా మేకర్స్ సెకండ్ సింగిల్‌కి సంబంధించిన అప్‌డేట్‌ను ప్రకటించారు. తన మ్యూజిక్‌తోనే కాకుండా పాటలను సరికొత్తగా పెర్ఫామ్ చేయడంలోనూ ట్రెండ్ సెట్ చేసే రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈసారి కూడా ప్రత్యేకమైన ప్లాన్‌తో ముందుకొచ్చారు. హై ఎనర్జీ ఫోక్ మాస్ ఆంథమ్‌గా రూపొందిన ఈ పాటను ఆగస్టు 28న అమెరికాలోని డల్లాస్‌లో జరగనున్న అనిరుధ్ కాన్సర్ట్ లో లాంచ్ చేయనున్నారు. వేలాది మంది అభిమానుల సమక్షంలో లైవ్ సెలబ్రేషన్స్ మధ్య ఈ పాటను ఆవిష్కరించనున్నారు. ఈ ప్రత్యేక లాంచ్‌లో నేచురల్ స్టార్ నాని కూడా అనిరుధ్‌తో కలిసి సందడి చేయనున్నారు. ఇప్పటికే పాట లాంచ్ కోసం నాని డల్లాస్ చేరుకున్నారు. దీంతో ఈ సింగిల్ లాంచ్ మరింత గ్రాండ్‌గా మారనుంది. కాన్సర్ట్ ప్రత్యేక ప్రదర్శన అనంతరం ఆగస్టు 29న ఈ పాటను ప్రపంచవ్యాప్తంగా డిజిటల్‌గా విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో మోహన్ బాబు, కాయదు లోహర్, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, తనికెళ్ల భరణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాంకేతికంగా 'ది ప్యారడైజ్'కు టాప్ టీమ్ పనిచేస్తోంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా,సిహెచ్ సాయి డీవోపీ, ఎడిటింగ్ నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్ అవినాష్ కొల్లా నిర్వహిస్తున్నారు.

'సప్త సాగరాలు దాటి' చిత్రంతో సౌత్ ఇండియా వ్యాప్తంగా విశేష ఆదరణ దక్కించుకున్న నటి రుక్మిణి వసంత్, ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్ల విమర్శలను ఎదుర్కొంటోంది. ఈ బ్యూటీ చేసిన 'అప్పుడు ఇప్పుడు ఎప్పుడు'తో పాటు 'భైరతి రణగల్', 'బగీరా', 'ఏస్', 'మదరాసి' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో ఆమె కథల ఎంపిక పై చర్చ మొదలైంది. తాజాగా యష్ హీరోగా నటించిన 'టాక్సిక్' చిత్రం డిజాస్టర్ టాక్ మూటగట్టుకోవడంతో రుక్మిణిపై విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. ఇందులో ఆమె పాత్రను డిజైన్ చేసిన తీరు, నటన సరిగా లేకపోవడంతో నెటిజన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరుస ఫ్లాపుల నేపథ్యంలో ఆమె తన నెక్స్ట్ చిత్రంపైనే ఆశలన్నీ పెట్టుకుంది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ సరసన నటిస్తున్న బిగ్ ప్రాజెక్ట్ 'డ్రాగన్' ఆమె కెరీర్‌కు ఎంతవరకు ప్లస్ అవుతుందో వేచి చూడాలి.

# డ్రాగన్‌తో అయినా బోణి కొట్టేనా..?

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644



# హాస్యం పండించడంలో సాటి లేని మేటి భమిడిపాటి

## నేడు హాస్య బ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు వర్ధంతి

హాస్య చమత్కార యుక్త మాటలు, సంభాషణలు, రచనల కోసం జీవితాంతం తపించి, తపస్సు చేసి సిద్ధి పొందిన తాపసి భమిడిపాటి కామేశ్వర రావు. వాస్తవానికి ఆయన హాస్య సృష్టి కర్త. అందుకే హాస్య బ్రహ్మగా గుర్తింపు పొందారు. భమిడిపాటి కామేశ్వరరావు (ఏప్రిల్ 28, 1897 – ఆగష్టు 28, 1958) రచయిత, నటుడు, నాటక కర్త. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఏప్రిల్ 28, 1897 సంవత్సరంలో నరసావ ధానులు, లచ్చమ్మ దంపతుల కు జన్మించారు. వీరు భీమవరం లో పాఠశాల విద్యను పూర్తి చేసి, ప్రతిభావంతులైన విద్యార్థుల కిచ్చే ఉపకార వేతనం సహాయంతో, పిఠాపురం మహారాజా కళాశాలలో గణితంలో పట్టా పొందారు. తరువాత కొంత కాలం నరసాపురం, కాకినాడ లలో ఉపాధ్యాయునిగా పని చేశారు. 1922లో ఎల్.టి పరీక్షలో ఉత్తీర్ణులై రాజమండ్రి వీరేశలింగం ఆస్తిక ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర అధ్యాపక పదవిలో స్థిరపడి, అదే పాఠశాలకు రెండు సంవత్సరాలు ప్రధానోపా ధ్యాయ బాధ్యతలను కూడా నిర్వహించారు. ఉపాధ్యా యునిగా పనిచేస్తూ వీరు చాలా నాటకాలు, నాటికలు, కథలు రచించారు. సమకాలీన సాంఘిక సమస్యలను తమ రచనలలో హాస్యరసాను రంజకంగా మలచిన ప్రజ్ఞాశాలి కావడం హాస్య బ్రహ్మ అని కొనియాడ బడ్డారు. త్యాగరాజు రచనలను, జీవితాన్ని చక్కగా పరిశీలించి రాగ, తాళ, వాద్యాలను ఆ గాయకుని భావానికి అనుగుణంగా సమకూర్చుకుని 'త్యాగరాజు ఆత్మ విచారం' రచన చేశారు. తన అభిప్రాయాలకు అనుగుణంగా రచించిన తమ నాటకాలను రాజమండ్రి కళాశాల వార్షికోత్సవాలలో ఆయనే దర్శకత్వం వహించి ప్రదర్శించే వారు. ఆయన స్వయంగా నటులు కూడా. ద్విజేంద్రలాల్ రచించిన 'చంద్రగుప్త'లో శక్తి సింహ పాత్ర పోషణ ద్వారా ఖ్యాతిని పొందారు. కామేశ్వర రావు ఎక్కువగా నాటికలు ముఖ్యంగా హాస్య ప్రధానమైన రచనలు గావించారు. ఆయన నాటికలకు చాలాభాగం ఫ్రెంచి నాటక కర్త మోలియర్ వ్రాసిన నాటికలు ఆధారం. ఆయన అనేక విషయాల మీద వ్రాసిన వ్యాసాలు 20వ శతాబ్దపు మొదటి అర్ధ భాగము లోని సామాజిక పరిస్థితులను తెలియ చేస్తాయి. ఆయన హాస్యం చదువరికి చురుక్కు మనిపిస్తుంది. ఆయన ఉత్తమ మైన హాస్య రచనలతో ఎందరినో మనసారా నవ్వించిన 1958, ఆగష్టు 28 న పరమ పదించారు. భమిడిపాటి కామేశ్వర రావు అనేక హాస్య రచనల నుండి కొన్ని హాస్య పూరకమై, ఈనాటికి సందర్భ సందర్భో చితంగా ఉండేవి .....వాటిల్లో కొన్ని తీసుకుంటే.. మన తెలుగు వ్యాసం నుండి......నూటికి నూరుమంది పైచిలుకు మాట్లాడే తెలుగు కలగాపులగమే. ఈ పులగంలో సంస్కృతం, పార్సీ, ఇంగ్లీషు మాత్రం జోరుగా పడ్డాయి. తెలుగు యొక్క మెత్తదనం వల్లనే ఇన్నిన్ని భాషల పదాలు బాణాల్లాగ హృదయంలో నాటే లాగ తెలుగులో గుచ్చుకుని ఉన్నాయి. తెలుగు శరీరంలో వాటిని నిల్చి ఉండనిస్తే అవి సెలలు వేసి ప్రాణం తీసేస్తాయ ని కొందరూ, లేక వాటిని పైకి లాగిపారేస్తే వెంటనే ప్రాణం పోకట అని కొందరూ. పరీక్షలు వ్యాసం నుండి...పరీక్షల కోసం, మార్కుల కోసం మాత్రమే బాధపడే వాడికి, విద్య అంటదు. విద్యకోసం పాటుపడే వాడికి పరీక్షవల్ల బాధే ఉండదు. ...జీవితం ఒక పెద్ద నిత్య పరీక్ష. జీవిత పరీక్షకి ఎప్పుడో తయా రు అవుతానులే అనడం కాక, అప్పటికప్పుడు తయారుగా ఉండడం మానవుడి విధి. పాలక సంఘాల్లో ఎన్నికల మజా అన్న వ్యాసం నుండి... జనం పంపిన మీదట పాలక సంఘంలోకి వెళ్ళి, వెంటనే ఆ జనాన్ని మరచి పోడమే ఎన్నికల్లో మజా; ఒకవేళ జ్ఞాపకం ఉంచుకున్నా, ఆ జనుల్లో మొదటి జనుడు తనేగదా అనుకోడం మరీ మజా. ఒకడు పాడు పన్లు చేస్తూ వుంటే, మనం కూడా, నెగ్గా లంటే, అంతకంటే పాడుపన్లు చెయ్యవలసి వచ్చేది ఎన్నిక ల్లోనే. ఎన్నికల నిఘంటువులో అసత్యం అధర్మం, అన్యాయం, ద్రోహం క్రౌర్యం, దారుణం లాంటి మాటలుండవు. గొంతు కేన్సర్ తో జీవిత చరమాంకంలో ఇంట్లో మంచం లో పడివున్న భమిడి పాటిని చూసేందుకు వచ్చిన బంధువు లు, మిత్రులకు ఆయన ఉన్న పరిస్థితి చూసి కళ్ళవెంట నీళ్ళు వచ్చే సందర్భంలో, అంత బాధలో కూడా "అరే, అప్పుడే ఏడుస్తా రెందుకు... ఆ కన్నీళ్ళకు ఇంకా కొంత సమయం ఉంది" అనే వారంటే భమిడిపాటి హాస్య చమత్కార ప్రియత్వం అర్థం అవుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# రాఖీ.. రక్షణకు ప్రతీక.. అనుబంధానికి పండుగ

- శ్రావణ పౌర్ణమికి ఎన్నో విశిష్టతలు
- జంధ్యాల పౌర్ణమి.. నారికేళ పూర్ణిమగానూ ప్రాచుర్యం
- ఉపాకర్మతో వేదాధ్యయనానికి శ్రీకారం
- సోదరుడి క్షేమం కోరుతూ సోదరి కట్టే రక్షాబంధనం
- పురాణ కాలం నుంచి కొనసాగుతున్న పవిత్ర సంప్రదాయం



శ్రావణ పౌర్ణమి అంటే కేవలం రాఖీ పండుగ మాత్రమే కాదు. ఆధ్యాత్మికత, కుటుంబ అనుబంధాలు, వేద సంప్రదాయాలు మేళవించిన విశిష్ట పర్వదినం. హయగ్రీవ జయంతిగా, జంధ్యాల పౌర్ణమిగా, రాఖీ పౌర్ణమిగా, నారికేళ పూర్ణిమగా వివిధ ప్రాంతాల్లో ఈ పర్వదినం ప్రసిద్ధి చెందింది. ప్రాంతాన్ని బట్టి ఆచారాలు మారినా.. రక్షణ, శ్రేయస్సు, అనుబంధం అనే భావనలే ఈ పండుగలో అంతర్లీనంగా కనిపిస్తాయి. వర్షాకాలం రాకను స్వాగతిస్తూ మధుర పదార్థాలను స్వీకరించడం కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయం. వరుణ దేవుడి అనుగ్రహం కోసం కొబ్బరికాయలను సమర్పించే ఆచారం కారణంగా దీనికి 'నారికేళ పూర్ణిమ' అనే పేరు వచ్చింది. ముంబయి సహా పశ్చిమ తీర ప్రాంతాల్లో ఈ రోజున సముద్రాన్ని పూజించి వరుణ దేవుడి కరుణ కోరడం ఆనవాయితీ. పూర్వకాలంలో సముద్రయానాలు, వర్తక కార్యకలాపాలకు కూడా ఈ పర్వదినానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉండేది.

### జంధ్యాల పౌర్ణమిగా ప్రత్యేకత

శ్రావణ పౌర్ణమికి వేద సంప్రదాయంలోనూ విశిష్ట స్థానం ఉంది. పూర్వకాలంలో ఉపాకర్మ అనంతరం వేదాధ్యయనాన్ని ప్రారంభించేవారు. ఉపాకర్మ అనేది కేవలం పండుగ కాకుండా వేదాధ్యయనానికి సంబంధించిన ముఖ్యమైన వైదిక కర్మగా భావిస్తారు. యజ్ఞోపవీతంలోని మూడు పోచలకు ఆధ్యాత్మికంగా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. సృష్టి, స్థితి, లయలకు ప్రతీకలైన త్రిమూర్తులను అవి సూచిస్తాయని సంప్రదాయ విశ్వాసం. జంధ్యాల పౌర్ణమి రోజున యజ్ఞోపవీతాన్ని మార్చుకొని వైదిక కర్మలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఋషులను స్మరించుకుంటూ ఋషి పూజలు, ఋషి తర్పణాలు నిర్వహిస్తారు. గౌతమ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ఠ, కశ్యప, అత్రి మహర్షులను సప్తర్షులుగా పేర్కొనే సంప్రదాయం ఉంది. ఇతర పురాణ గ్రంథాల్లో సప్తర్షుల జాబితాలో భిన్నమైన పేర్లు కూడా కనిపిస్తాయి. యజుర్వేద సంప్రదాయంలో పౌర్ణమి తిథికి, రుగ్వేద సంప్రదాయంలో శ్రవణ నక్షత్రానికి, సామవేద సంప్రదాయంలో హస్త నక్షత్రానికి ఉపాకర్మలో ప్రాధాన్యం ఉన్నట్లు వైదిక సంప్రదాయాలు పేర్కొంటాయి.



### రాఖీ.. ఓ దారమే కాదు

శ్రావణ పౌర్ణమికి ప్రజల్లో అత్యంత ప్రాచుర్యం తెచ్చింది రక్షాబంధనం. సోదరి తన సోదరుడి ముంజేతికి రాఖీ కట్టి అతడి ఆయురారోగ్యాలు, శ్రేయస్సును కోరుతుంది. సోదరుడు తన సోదరికి జీవితాంతం అండగా ఉంటాననే భావనను వ్యక్తం చేస్తాడు. అందుకే రాఖీ కేవలం రంగురంగుల దారం కాదు.. సోదరీసోదరుల మధ్య ప్రేమ, నమ్మకం, బాధ్యతలకు ప్రతీకగా నిలుస్తోంది. రాఖీని పట్టు లేదా నూలు దారాలతో తయారు చేయడం పూర్వపు సంప్రదాయం. కాలక్రమంలో అది రంగురంగుల అలంకరణలతో ఆభరణాన్ని తలపించేలా మారింది. సోదరుడికి బొట్టు పెట్టి, హారతి ఇచ్చి, రాఖీ కట్టడం.. అనంతరం సోదరుడు సోదరికి కానుక అందించడం సంప్రదాయంగా కొనసాగుతోంది.

### పురాణాల్లోనూ రక్షాబంధనం

రక్షాబంధనానికి సంబంధించి పురాణాల్లో పలు కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ధర్మరాజు శ్రీకృష్ణుడిని రక్షణకు మార్గం అడిగినప్పుడు రక్షాబంధన విధిని వివరించినట్లు ఒక కథనం చెబుతుంది. దేవాసుర సంగ్రామ సమయంలో ఇంద్రాణి ఇంద్రుడికి రక్షను కట్టి విజయాన్ని ఆకాంక్షించిన కథ కూడా రక్షాబంధన ప్రాశస్త్యంతో ముడిపడి ఉంది. కాలక్రమంలో రక్షాబంధనం సోదరీసోదరుల అనుబంధానికి ప్రధాన చిహ్నంగా మారింది. రక్తసంబంధం లేకపోయినా ఒక మహిళ పురుషుడికి రాఖీ కట్టి సోదర భావాన్ని వ్యక్తం చేసే సంప్రదాయం కూడా ఏర్పడింది. రాఖీ స్వీకరించిన వ్యక్తి ఆమెకు అండగా, రక్షకుడిగా ఉండాలన్న భావన దీనిలో కనిపిస్తుంది.

### అనుబంధాలకు అక్షయ తోరణం

కాలం మారింది.. జీవన విధానాలు మారాయి.. కుటుంబాలు ప్రపంచంలోని విభిన్న ప్రాంతాలకు విస్తరించాయి. కానీ రాఖీ కట్టే చేతిలోని ఆప్యాయత మాత్రం మారలేదు. చిన్న తోరంతో మొదలయ్యే ఈ వేడుక సోదరీసోదరుల మధ్య జీవితకాల అనుబంధాన్ని గుర్తుచేస్తుంది. అందుకే రాఖీ అంటే చేతికి కట్టే దారం మాత్రమే కాదు.. 'నీకు నేనున్నా' అని ఇచ్చే భరోసా. రక్షణకు ప్రతీక.. అనుబంధానికి చిరునామా.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వేదోద్ధరణ అవతారమే హయగ్రీవుడు

"జ్ఞానానందమయం దేవం, నిర్మలం స్ఫటికాకృతిం, ఆధారం సర్వ విద్యానాం హయగ్రీవ ముపాస్మహే" పురాణేతిహాసాలలో ప్రసిద్ధములైన విష్ణువు అవతారాలలో హయగ్రీవావతారం ఒకటి. దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం శ్రీహరి దాల్చిన అవతారాల్లో హయగ్రీవ అవతారం ఒకటి. సమస్త విద్యలను, జ్ఞానాన్ని పాండిత్యాన్ని అనుగ్రహించే శ్రీ గురుమూర్తి హయగ్రీవ స్వామి. వేదోద్ధరణకై సంభవించిన అవతారమే ఇది. మధుకైటభులు అనే రాక్షసులు వేదాలను దొంగిలిస్తే, విష్ణుమూర్తి హయగ్రీవ అవతారాన్ని ధరించి, ఆ మధుకైటభులను వధించి...వేదాలను రక్షించాడు. హిందూమతంలో, హయగ్రీవ స్వామిని కూడా విష్ణుమూర్తి అవతారముగా భావిస్తారు. గుర్రపుముఖంతో, నరశరీరంతో, చతుర్భుజుడై శంఖచక్రాలను ధరించి వామాంకంలో లక్ష్మీదేవి సహితంగా ఆవిర్భవించిన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే హయగ్రీవ స్వామి. ఆయనలో సకల దేవతలూ కొలువై ఉన్నారని పురాణాలు పేర్కొంటున్నాయి. సూర్యచంద్రులు కళ్ళుగా, దేవతలు ఎముకలుగా, అష్టవసువులు పాదాలుగా, అగ్ని నాలుకగా, సత్యం వాక్కుగా, బ్రహ్మ హృదయంగా... ఇలా ఆయనలోని అణువణువూ దేవతామయమని అంటారు. హయగ్రీవున్ని జ్ఞానమునకు, వివేకమునకు, వాక్కుకు, బుద్ధికి, అన్ని విద్యలకు దేవుడుగా భావిస్తారు. హయగ్రీవ స్వామిని చదువుల యొక్క దేవుడుగా పూజిస్తారు. జ్ఞానం, వాక్కు, ఆచారము నాశనం కాకుండా సాగునట్లు అనుగ్రహించిన హయగ్రీవ మూర్తిగా శ్రావణ పూర్ణిమ నాడు మహా విష్ణువును కొలవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. హయగ్రీవుడనగా గుర్రం శిరస్సు, మానవ దేహం కలిగిన స్వామి, నరసింహ స్వరూపం వలే వైకుంఠ నాథుడు హయగ్రీవ ధారియైనారు. 'హయ' అనగా విజ్ఞానం . 'గ్రీవ' అనగా కంఠం. అన్ని విద్యలూ కంఠస్థమై ఉన్న సర్వ విద్యా రూపమే హయగ్రీవ మూర్తి. భాగవతంలో సప్తమ స్కంధంలో హయగ్రీవుడు బ్రహ్మ చేసిన యజ్ఞంలో ఆవిర్భవించినట్లు, స్కంద పురాణంలో దేవతల ప్రార్ధనలతో విష్ణువు అశ్వముఖులై అవతరించినట్లు, పూర్వగాథాలహరి లోనూ హయగ్రీవ వృత్తాంతాలు పేర్కొనబడినాయి. దేవీ భాగవతం ప్రకారం ఒకానొక సమయాన మహావిష్ణువు రాక్షసులతో పదివేల ఏళ్ళు భీకర యుద్ధం చేసి అలసి పోయి, అల్లెత్రాడు గట్టిగా బిగించి ఉన్న ధనుస్సును నేలమీద నిలబెట్టి, దాని కోపుమీద తమ గడ్డాన్ని ఆనించి, నిలబడే నిద్ర పోయారు. విష్ణువును వెదకుతూ



వచ్చిన దేవతలు, నిద్ర లేపడానికి భయపడి, బ్రహ్మ దేవుడు ఒక చెద పురుగును సృష్టించి, వింటి నారిని కొరకమని చెబుతారు. పురుగు కొరకడంతో ధనుస్సు విసురుగా తుళ్ళి, వింటికి ఉన్న బాణం కొన విష్ణువు మెడకు తగిలి, ఆయన శిరస్సు తెగి, ఎగిరి పోయింది. దేవతలంతా మహాదేవిని ప్రార్ధించగా, ఆమె ప్రత్యక్షమై సూచించిన విధంగా గుర్రాన్ని వధించి, దాని తలను తెచ్చి దేవశిల్పి యైన త్వష్ట ద్వారా విష్ణువు మొండానికి అతికించారు. బ్రహ్మ ప్రాణం పోయగా, హయగ్రీవులైనారు. సృష్టి ఆరంభంలో అగణిత ఏళ్ళ క్రింద చతుర్ముఖ బ్రహ్మకు కు పరమాత్మ వేదశాస్త్రాలను బోధించారు. మధుకైటభులనే ఇరువురు అసురులు, బ్రహ్మ నుండి వేద విద్యను దొంగిలించి, రసాతలానికి పారి పోయారు. హయగ్రీవ రూపంలోని శక్తితో మాత్రమే తాను మరణించునట్లు, హయగ్రీవుడనే రాక్షసుడు, బ్రహ్మ ద్వారా పొందిన వరం కారణంగా, దేవి కృప వల్ల హయగ్రీవ అవతారులైన విష్ణు అదే పేరుగలిగిన అసుర సంహారం చేయడం జరిగింది. తాను చంద్రమండల వాసియైన హయగ్రీవుడు, మహానంద స్వరూపుడు, ఆయన నాసిక నుండి వేదాలు ఆవిర్భవించాయని పురాణ కథనం. హయగ్రీవ విరాట్ స్వరూపాన సత్యలోకం శిరస్సుగా, భూలోకం నాభిగా, పాతాళం పాదాలుగా, అంతరిక్షం కళ్ళుగా, సూర్యుడు కంటి గుడ్లుగా, చంద్రుడు గుండెగా, దిక్పాల కులు భుజాలుగా, అగ్ని ముఖంగా, సముద్రాలు ఉదరంగా, నదులు నదులు, పర్వతాలు ఎముకలు, మేఘాలు కేశాలుగా, సర్వ దేవతా స్వరూపులైనారు. హయగ్రీవుడు తెల్లని శరీరం కలవాడు. లక్ష్మీదేవిని తొడపై కూర్చోబెట్టుకుని, తెల్లని పద్మాసీనులై ఉంటారు. కుడిచేతిలో చక్రం, పై ఎడమ చేతిలో శంఖం, కింది ఎడమ చేతిలో పుస్తకం, కింది కుడిచేయి చిన్ముద్ర ధరించి ఉంటారు. శ్వేతపద్మం సమస్త ఐశ్వర్యాలకు చిహ్నం. చిన్ముద్ర జ్ఞానానికి, పుస్తకం సకల విద్యలకు, శంఖం సకల సృష్టికి కారణభూతమైన నాదానికి, చక్రం అజ్ఞాన సంహారానికి చిహ్నాలు. హయగ్రీవుని ఉపాసించిన వారికి సకలం కలుగుతాయని విశ్వాసం. ఏ దేవతకైనా నామమే శరీరమని, ఆ నామంలోని అక్షరాలే అవయవాలని శాస్త్రవచనం. అందుకే వైష్ణవులకు ఆధ్యాత్మిక విద్యాభ్యాసం హయగ్రీవ నామోపదేశంతో ప్రారంభించడం సంప్రదాయం. హయగ్రీవ నామాన్ని ఉచ్చరించే వారు శివస్వరూపులుగా, పలికిన వారు విష్ణు స్వరూపులుగా, విన్నవారు బ్రహ్మ స్వరూపులుగా అవుతారని బ్రహ్మ చెప్పడాన్ని బట్టి హయగ్రీవ నామ ప్రాధాన్యత స్పష్టం అవుతుంది. భారతావనిలో చాలా చోట్ల హయగ్రీవ ఆలయాలు ఉన్నాయి.హయగ్రీవుని విశాల ఆలయం అస్సాంలో ఉంది. తిరుమల శ్రీహరి ఆలయ మహా ప్రదక్షిణ మార్గంలో శ్రీ లక్ష్మీహయగ్రీవ ఆలయం ఉంది.ప్రతినిత్యం చదువుకునే ఈ లలితా సహస్రనామాలు కూడా హయగ్రీవుని ద్వారానే వచ్చాయి. హయగ్రీవుడు చదువులకు అధిదైవం. మన శాస్త్రాలు అంటే ఎంతో కాలంగా ఆచరించి పొందిన అనుభవాల సారాలు. అందుకే "ఆచార ప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః" చాలా కాలంగా చేసిన ఆచారములే ధర్మములు, అవి మనల్ని రక్షించేవి కనుక వాటిని చెప్పేవి శాస్త్రాలు అయ్యాయి. శాస్త్రాలను బట్టి ఆచారాలు సంప్రదాయాలు ఏర్పడ్డాయి. జ్ఞానం, విద్య, సద్య స్ఫురణ, సృజనాత్మకత కావాలనుకునే వారు హయగ్రీవుని ఆరాధించాలి. హయగ్రీవ జయంతిని శుభప్రదంగా భావించి, అక్షరాభ్యాసం కూడా చేసుకుంటారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494